
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు
జిల్లా వార్తలు
బుధవారం 17 జనవరి 2024



సోమశిలలో 29.906 టీఎంసీల నీరు నిల్వ



అనంతసాగరం: సోమశిల జలాశయంలో మంగళవారం నాటికి 29.906 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఎగువ నుంచి ఎలాంటి ప్రవాహం రాకపోగా, దిగువ డెల్టాకు 2,400, ఉత్తర కాలువకు 500, దక్షిణ కాలువకు 200 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నామని వారు తెలిపారు.

కనుల పండువగా తెప్పోత్సవం

నేడు ఏటి పండుగ

- వైభవంగా కనుమ వేడుకలు
- ఘనంగా పారువేట
- ఉత్సాహంగా సంక్రాంతి సంబరాలు
- పెద్దలకు వస్త్రాల సమర్పణ



నెల్లూరు మైపాడు గేట్ వద్ద జాఫర్‌సాహెబ్ కాలువ ఘాట్‌లో భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి తెప్పోత్సవం (అంతర్‌చిత్రంలో) తెప్పపై విహరిస్తున్న స్వామి, అమ్మవారు

నెల్లూరు (సాంస్కృతికం) జనవరి 16 : కనుమ పండుగ సందర్భంగా మంగళవారం రాత్రి నెల్లూరు మైపాడుగేటు ఘాట్‌లో భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామికి వైభవంగా తెప్పోత్సవం జరిగింది. నవాబుపేటలోని మల్లేశ్వరస్వామి ఆలయం నుంచి స్వామివార్లను ఊరేగింపుగా తీసుకువచ్చి కేసీపీ కల్యాణ మండపంలో విడిది చేశారు. స్వామి, అమ్మవార్లను దర్శించుకునేందుకు భక్తులు వేలాదిగా తరలివచ్చారు. ఈ ఉత్సవానికి ముఖ్య అతిథులుగా నగర ఎమ్మెల్యే డాక్టర్ పీ అనీల్‌కుమార్ యాదవ్, స్థానిక కార్పొరేటర్లు పాల్గొన్నారు. పోలీసులు భారీ బందో బస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమాలను ఆలయ చైర్మన్ వంగాల శ్రీనివాసులు రెడ్డి, ఈవో తాతా శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.



బుచ్చి : జొన్నవాడలో కామాక్షితాయి పారువేట ఉత్సవం

● తరలివచ్చిన దేవతలు

కాగా నెల్లూరు నగరంలోని స్టోన్‌హౌస్‌పేట, నవాబు పేట ఆలయాలు, రాజరాజేశ్వరి, మూలాపేట శివాలయం, వేణుగోపాలస్వామి, శ్రీకృష్ణ ధర్మరాజులస్వామి, ఇరుకళల పరమేశ్వరి, తల్పగిరి రంగనాథస్వామి, వాసవీ కన్యకాపరమేశ్వరి, పప్పులవీధి సిద్ధివిఘ్నేశ్వరుడు, భావనారాయణస్వామి, అయ్యప్పస్వామి, గొలగమూడి వెంకయ్యస్వామి, ఉడయవర్లు తదితర ఆలయాల్లోని స్వామి అమ్మవార్లు తరలివచ్చి కొలువుదీరారు. పెద్ద సంఖ్యలో భక్తులు, నగర ప్రముఖులు, రాజకీయ నాయకులు స్వామివార్లను దర్శించుకున్నారు. పారువేట ఉత్సవానికి రాజరాజే శ్వరి రైస్ ఇండస్ట్రీస్ అధినేత కొలపర్తి రమేష్ ఉభయకర్తగా వ్యవహరించారు.

● సంప్రదాయబద్ధంగా కనుమ

కనుమ పండుగను మంగళవారం జిల్లా ప్రజలు సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. పాడి పంటలు, పశుసంపదకు సంబంధించిన ఈ పండుగను వైభవంగా జరుపుకున్నారు. పల్లెల్లో రైతులు తమ పశువులకు శుభ్రంగా స్నానం చేయించి, పసుపు, కుంకుమలతో సుందరంగా అలంకరించారు. కొమ్ములను వివిధ రంగులతో తీర్చిదిద్దారు. పశువుల పాకల్లో పొంగళ్లు పెట్టి సూర్యనారాయణుడికి పూజలు చేశారు. ఈ సందర్భంగా భక్తులు ఆలయాల్లోని గోమాతలకు పూజలు చేశారు. ఈ సందర్భంగా పెంచలకోన, తల్పగిరి రంగనాథ స్వామి, వేదగిరి నరసింహకొండ, కొండ బిట్ర గుంట, జొన్నవాడ తదితర ఆలయాల్లో కనుమ పారువేటను ఘనంగా నిర్వహించారు.



సీతారామపురం : మంగళవారం జనసేన ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీ

● ఆనందోత్సాహాలతో సంక్రాంతి

జిల్లా ప్రజలు ఆనందోత్సాహాల మధ్య సోమవారం సంక్రాంతిని జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఇంటింటా పొంగళ్లు పొంగించారు. అరిసెలు, లడ్డూలు, మురుకులు, పప్పు చక్కలు తదితర సంప్రదాయ పిండివంటలను నైవేద్యాలుగా సమర్పించి పెద్దలకు వస్త్రాలు పెట్టి పూజలు చేశారు. బంధుమిత్రుల విందులు, వినోదాలతో సరదాగా గడిపారు. చిన్నాపెద్దా తేడా లేకుండా ఉత్సాహంగా గాలిపటాలు ఎగురవేశారు. పోలీసులు ఆంక్షలు ఉన్నా కోడి పందేలు మాత్రం యథావిధిగా జరిగాయి. జిల్లాలోని అన్ని ప్రముఖ ఆలయాలను రంగురంగుల పుష్పాలు, విద్యుత్ దీపాలతో అలంకరించారు. ప్రజాప్రతినిధులు వారి స్వగృహాలు, సొంత గ్రామాల్లో బంధుమిత్రులతో కలిసి వేడుకలు జరుపుకున్నారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పండుగ సంబరాలను స్వగ్రామం పొదలకూరు మండలం తోడేరులో జరుపుకున్నారు. రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దంపతులు నెల్లూరులోని తమ స్వగృహంలో పండుగ సంబరాలను జరుపుకున్నారు. మాజీ మంత్రి పొంగూరు నారాయణ, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తదితరులు కూడా సంక్రాంతి వేడుకలను తమ తమ స్వగృహాల్లో ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా పలుచోట్ల ముగ్గులు పోటీలు జరిగాయి. విజేతలకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు.



ఉలవపాడు : మంగళవారం రాత్రి నిర్వహించిన శ్రీదేవి,భూదేవి సమేత వేణుగోపాలస్వామి తెప్పోత్సవం

● ఘనంగా పెద్దల పండుగ

నెల్లూరు నగరంలోని బోడిగాడి తోట లో సోమవారం పెద్దల పండుగ ఘనం గా జరిగింది. నగరం నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చి తమ పూర్వీకుల సమాధులను శుభ్రం చేసి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో నగర ఎమ్మెల్యే డాక్టర్ పీ అనిల్‌కుమార్ యాదవ్ పాల్గొని ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భం గా మొక్కలు పంపిణీ చేశారు. నెల్లూ రు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, మాజీ మంత్రి పొంగూరు నారాయణ తదితరులు కూడా సంక్రాంతి రోజున ప్రజల మధ్య తిరుగుతూ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.



నెల్లూరు బోడిగాడితోటలోని సమాధులను పూజించి, పెద్దలను స్మరించుకుంటున్న నగర వాసులు



కావలి : గ్రామోత్సవంలో కలుగోళ శాంభవి

నేడు ఏటి పండుగ

సంక్రాంతి 4వరోజు ఏటి పండుగతో నెల్లూరులో పెద్ద పండుగ సంబరాలు ముగుస్తాయి. బుధవారం జరిగే ఏటి పండుగ కోసం పెన్నాలో నగర పాలక సంస్థ భారీ ఏర్పాట్లు చేసింది. భోగి రోజున ముత్తైదువులు గౌరమ్మ(గొబ్బిళ్ల)ను ప్రతిష్ఠించి భక్తిశ్రద్ధలతో పూజలు చేస్తారు. అనంతరం గొబ్బిలను పెన్నాలో ఓలలాడించడం (నిమజ్జనం) చేసేందుకు వస్తారు. దీన్నే ఏటి పండుగ అంటా రు. పతంగులు ఎగురవేయడం, ఆటపాటలతో ఆ ప్రాం తం కోలాహలంగా ఉంటుంది. ఏటి పండుగకు వచ్చే భక్తులను ఆశీర్వదించేందుకు వివిధ ప్రాంతాల నుంచి అమ్మవార్లు తరలివస్తారు.

● మకరజ్యోతి దర్శనం

నగరంలోని అయ్యప్పగుడిలో సోమవారం సాయంత్రం మకరజ్యోతి దర్శనం నేత్రానందంగా జరిగింది. మకర జ్యోతి దర్శనం కోసం భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఈ కార్యక్రమాన్ని ఆలయ ధర్మకర్తలు, కమిటీ కార్యదర్శి కేవీ రత్నం, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

అక్కడా... ఇక్కడా... ఒక్కరే!

- ఇరిగేషన్‌లో ఒక్కో ఇంజనీరుకు రెండేసి బాధ్యతలు
- పెరుగుతున్న పనిభారం, ఆపై అవినీతి
- ఉద్యోగోన్నతులు కల్పించకపోవడమే కారణం
- కీలక పోస్టులకు భారీ డిమాండ్
- భర్తీకి వేడుకున్నా పట్టించుకోని ప్రభుత్వం

నెల్లూరు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత పరిస్థితుల్లో ఒక పోస్టును నిర్వహించడమే చాలా కష్టంగా ఉండగా, ఒక్కొక్క అధికారికి రెండేసి పోస్టులు కట్టబెడితే వారి పరిస్థితి ఎలా ఉంటుంది..? ఇరిగేషన్ శాఖలో ఈ పరిస్థితి కారణంగా ఇంజనీర్లపై పనిభారం పెరగడంతో పాటు అవినీతి కూడా పెరుగుతోంది. ముఖ్యంగా కొన్ని కీలకమైన పోస్టుల్లో ఇన్‌చార్జులుగా కూర్చునేందుకు కొందరు అధికారులు రాజకీయ నాయకులు చెప్పిందల్లా చేస్తున్నారు. అసలు పనివదిలేసి ఈ ఇన్‌చార్జి పోస్టులపైనే ఎక్కువ మక్కువ చూపుతున్నారు. ఏ శాఖలో లేని సమస్య ఇరిగేషన్ శాఖలో కొన్నేళ్లుగా తీవ్రతరమవుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ఉద్యోగోన్నతులు కల్పించకపోవడమే రెండేసి పోస్టులకు కారణమని ఇంజనీర్లు చెబుతున్నారు. జిల్లాలో రెగ్యులర్ ఇరిగేషన్‌తో పాటు సోమశిల, తెలుగుగంగ ప్రాజెక్టుల్లో ఈ ఇన్‌చార్జుల పాలన కొనసాగుతోంది. ఎస్ఈ స్థాయి నుంచి జేఈ స్థాయి వరకు పలువురికి రెండేసి పోస్టులున్నాయి. కొందరు ఒకేసర్కిల్‌లో రెండో పోస్టు బాధ్యతలను నిర్వర్తి స్తుండగా, మరికొందరు పక్క సర్కిల్‌లో పనిచేస్తున్నారు. ఇంకొందరైతే ఏకంగా పక్క జిల్లాల్లోనూ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తుండడం గమనార్హం. ఫలితంగా వీరు వారి రెగ్యులర్ సీట్లలో ఎక్కువ సేపు కూర్చోవడం లేదు. ఇది రైతులకు, ప్రజలకు ఇబ్బందిగా మారుతోంది.

● 30 మందికి వరకు అదనపు బాధ్యతలు

తెలుగుగంగ ఎస్ఈగా ఉన్న హరినారాయణ రెడ్డి కడప జిల్లా సీఈగా వ్యవహరిస్తున్నారు. ఇరిగేషన్ సర్కిల్ కావలి ఈఈగా పనిచేస్తున్న కృష్ణమోహన్ అదే సర్కిల్ ఎస్ఈగా ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహిస్తున్నారు. తెలుగుగంగలో రాపూరు ఈఈగా పనిచేస్తున్న వెంకటరమణారెడ్డికి సోమశిల సర్కిల్ ఎస్ఈ బాధ్యతలను అప్పగించారు. తెలుగుగంగ రెండో డివిజన్ ఈఈగా పని చేస్తున్న విజయకుమార్‌రెడ్డి చిత్తూరు ఇరిగేషన్ సర్కిల్ ఇన్‌చార్జి ఎస్ఈగా పనిచేస్తున్నారు. ఇరిగేషన్ సర్కిల్ ఆత్మకూరు డీఈ-1గా పని చేస్తున్న అధికారి అదే డివిజన్ ఈఈగా కూడా పని చేస్తుండగా, ఆత్మకూరు డివిజన్-2లో జేఈగా పనిచేస్తున్న ఇంజనీర్ ఆ డివిజన్‌కు డీఈగా ఉన్నారు. నెల్లూరు సబ్ డివిజన్ డీఈ టీజీపీ మూడో డివిజన్‌కు ఇన్‌చార్జి ఈఈగా పనిచేస్తున్నారు. కావలి డీఈగా పనిచేస్తున్న అధికారి డ్రైనేజీ డివిజన్ ఇన్‌చార్జి ఈఈ బాధ్యతలు కూడా చూస్తున్నారు. నారాయణరెడ్డిపేట సెక్షన్ జేఈ పొదలకూరు డీఈగా పని చేస్తుండగా, కుల్లూరులోని ఓ జేఈ అక్కడే డీఈగా కూడా రెండో పోస్టును నిర్వహిస్తున్నారు. ఇలా జిల్లాలోని సుమారు ముప్పై మంది వరకు జేఈ, డీఈ, ఈఈ, ఎస్ఈలు రెండేసి పోస్టుల్లో కొనసాగుతున్నారు.

● ఆగిన ఉద్యోగోన్నతులు

కొన్నేళ్ల నుంచి ఇరిగేషన్ శాఖలో ఉద్యోగోన్నతలు నిలిచిపోయాయి. జోనల్ సిస్టమ్ ప్రకారం ఉద్యోగోన్నతులు కల్పించాల్సి ఉండగా, ఆ విధానాన్ని పక్కనపెట్టి వర్టికల్ సీనియారిటీ విధానంలో పదోన్నతి కల్పించారు. ఇది వివాదంగా మారడంతో విషయం కోర్టు మెట్లెక్కింది. అప్పటి నుంచి ప్రభుత్వ స్థాయిలో ఒక నిర్దిష్ట విధానాన్ని అమలు చేయలేకపోతున్నారు. దీంతో ఇంజ నీర్లకు ఉద్యోగోన్నతులు రాకపోవడం, పైస్థా నాల్లో ఉన్న వారు రిటైర్డ్ అవుతుండ డంతో ఆ స్థానాల్లో ఇన్‌చార్జులుగా నియమిస్తూ వస్తున్నారు. కాగా కొన్ని కీలకమైన పోస్టులకు భారీ డిమాండ్ ఉంది. ఆ స్థానాల్లో ఎఫ్ఏసీ తెచ్చుకునేందుకు, కొనసాగేందుకు కొందరు అధికా రులు అధికార పార్టీ నేతలకు తొత్తులుగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి.



సమస్యలు పరిష్కరించండి

నేతలకు అంగన్‌వాడీల వినతి
ప్రభుత్వం మొండివైఖరి విడనాడాలి
కలెక్టరేట్ వద్ద దీక్షలో సీఐటీయూ

నెల్లూరు (వైద్యం) జనవరి 16: తమ సమస్యలు పరిష్కరించాలంటూ అంగన్‌వాడీలు, సీఐటీయూ నేతలు మంగళవారం రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందచేశారు. అలాగే నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ యాదవ్‌కు అర్జీ ఇచ్చారు. అంగన్‌వాడీల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తా నని వేమిరెడ్డి వారికి హామీ ఇచ్చా రు. ఎమ్మెల్యే అనిల్ మాట్లాడుతూ ప్రభుత్వం దృష్టికి మీ సమస్యలను తీసుకు వెళతామని తెలియచేశారు. అలాగే విజయడెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగా రెడ్డిని కూడా నాయ కులు కలిసి వినతి పత్రం ఇచ్చారు.



అంగన్‌వాడీల వినతిపత్రాన్ని పరిశీలిస్తున్న రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

● కలెక్టరేట్ వద్ద దీక్ష

అనంతరం కలెక్టరేట్ వద్ద నిర్వహించిన దీక్షలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అజయ్‌కుమార్ మాట్లాడారు. అంగన్‌వాడీల సమ్మె 36వ రోజుకు చేరుకున్నా ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన లేదన్నారు. ఇప్పటికే ఐదు దఫాలుగా ముఖ్యనేతలతో ప్రభుత్వం చర్చలు జరిపినా సమస్యల పరిష్కారంపై స్పష్టత ఇవ్వలేదన్నారు. పండుగలలోనూ కుటుంబ సభ్యులకు దూరంగా ఉండి అంగన్‌వాడీలు సమ్మె చేస్తున్నారని, వారి ఆవేదనను ప్రభుత్వం అర్థం చేసుకుని వేతనాలు పెంచాలని కోరారు. లేకుంటే సమ్మె కొనసాగుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నగర కార్యదర్శి నాగేశ్వరరావు, కొండా ప్రసాద్, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సుజాత, నాయకురాళ్లు కామాక్షమ్మ, రజని, మల్లెమ్మ, రమాదేవి, సుమతి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఎడ్ల పందేల ప్రారంభం

వలేటి వారి పా లెం, జనవరి 16: వలేటివారి పాలెం మండలంలోని కాకుటూరు బస్టాండు సెంటరులో కందుకూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో మంగళవారం రాష్ట్ర స్థాయి ఎడ్లపందేలు ప్రారంభమయ్యాయి. పోటీలను నాగేశ్వరరావుతో పాటు టీడీపీ నాయకురాలు ఉన్నం నళినీదేవి జెండా ఊపి ప్రారంభించారు. ఈ పోటీలకు జూనియర్ విభాగంలో 11 ఎడ్ల జతలు, సీనియర్ విభాగంలో 15 ఎడ్లజతలు పాల్గొన్నాయి. 18 క్వింటాళ్ల బరువు కలిగిన బండను 20 నిమిషాలలో ఎక్కువ దూరం లాగిన ఎడ్లజతకు మొదటి బహుమతి ఇవ్వనున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు ఎడ్ల పోటీలు పూర్తయిన అనంతరం బుధవారం రాత్రి బహుమతులు అందజేయనున్నారు. పోటీలను తిలకించేందుకు ప్రజలు భారీగా తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాదాల లక్ష్మీనరసింహం, పొడపాటి నరసింహం, పొడపాటి సుధాకర్ పాల్గొన్నారు.



వలేటివారిపాలెం మండలం కాకుటూరులో రాష్ట్రస్థాయి ఎడ్ల పందేలను ప్రారంభిస్తున్న ఇంటూరి నాగేశ్వరావు

జిల్లా వ్యాప్తంగా తహసీల్దార్ల బదిలీ

● ప్రారంభమైన ఎన్నికల సన్నాహాలు

నెల్లూరు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పలువురు తహసీల్దార్‌లు బదిలీ అయ్యారు. రానున్న సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని జిల్లాలో సుదీర్ఘకాలంగా పనిచేస్తున్న తహసీల్దార్‌లను పక్క జిల్లాలకు బదిలీలు చేస్తూ రాష్ట్ర భూ పరిపాలనా చీఫ్ కమిషనర్ ఇంతియాజ్ మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీచేశారు. బాపట్ల కలెక్టరేట్‌లో పనిచేస్తున్న సీతారత్నంను లింగసముద్రం తహసీల్దార్‌గా, బాపట్ల కలెక్టరేట్‌లో పనిచేస్తున్న వీ.కృష్ణకాంత్‌ను కందుకూరు తహసీల్దార్‌గా, బాపట్ల ఆర్డీవో కార్యాలయంలో పనిచేస్తున్న శ్రీచరణ్‌ను మర్రిపాడు తహసీల్దార్‌గా, గుంటూరు ఆర్డీవో కార్యాలయంలో ఏవోగా పని చేస్తున్న ఎస్‌కె.ఇస్మాయిల్‌ను విడవలూరు తహసీల్దార్‌గా, గుంటూరు కలెక్టరేట్‌లో పనిచేస్తున్న ఎం.పూర్ణచంద్రరావును వెంకటాచలం తహసీల్దార్‌గా బదిలీ చేశారు. అలాగే నరసరావుపేట ఆర్డీవో కార్యాలయంలో ఏవోగా పనిచేస్తున్న చంద్రారెడ్డిని వరికుంటపాడు తహసీల్దార్‌గా, రేపల్లె ఆర్డీవో కార్యాలయ ఏవో జాన్‌పీటర్‌ను దగదర్తి తహసీల్దార్‌గా, చీరాల ఆర్డీవో కార్యాలయ ఏవో నరసింహారావును ఆత్మకూరు తహసీల్దార్‌గా బదిలీ చేశారు. బాపట్ల ఆర్డీవో కార్యాలయ ఏవో గోపీకృష్ణను చేజర్ల తహసీల్దార్‌గా, ప్రకాశం కలెక్టరేట్‌లో పనిచేస్తున్న రాజ్యలక్ష్మిని నెల్లూరు కలెక్టరేట్ లాండ్ రికార్డ్ తహసీల్దార్‌గా, ప్రకాశం కలెక్టరేట్‌లో పనిచేస్తున్న చిరంజీవిని మనుబోలు తహసీల్దార్‌గా, మార్కాపురంలో కేఆర్‌ఆర్‌సీలో పనిచేస్తున్న శ్రీనివాసరావును కలువాయి తహసీల్దార్‌గా, ప్రకాశం కలెక్టరేట్‌లో పనిచేస్తున్న శ్రావణ్‌కుమార్‌ను కొండాపురం తహసీల్దార్‌గా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. తక్షణ ఈ ఆదేశాలు అమల్లోకి వస్తాయని పేర్కొన్నారు.

కోడిపందేల్లో ఘర్షణ

● పరస్పర దాడిలో ఐదుగురికి గాయాలు

కావలి రూరల్, జనవరి 16: కోడిపందేల నగదు విషయంలో ఘర్షణకు దిగి ఒకరిపై ఒకరు దాడి చేసుకోవడంతో ఐదుగురికి గాయాలయ్యారు.ఈ సంఘటన మంగళవారం కావలి పట్టణ తుఫాన్‌నగర్ బీసీ కాలనీలో చోటుచేసుకుంది. స్థానికుల, బాధితుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. తుఫాన్‌నగర్ బీసీ కాలనీకి చెందిన కొంతమంది జంగాల కాలనీ సమీపంలో ఉన్న బీడులో కోడిపందేల్లో పాల్గొన్నారు. అక్కడ రూ.500 నగదు విషయంలో ఒకరిపై ఒకరు గొడవలు పడ్డారు. కోడిపందేల అనంతరం ఇళ్లకు చేరుకున్న తరువాత పాశం చలమయ్య, ఆయన కుమారులు సునీల్, చంద్రశేఖర్‌లపై తిరుమలరావు, రమేష్, పాండురంగారావు కర్రలతో దాడికి దిగారు. అనంతరం ఒకరిపై ఒకరు చేసుకున్న దాడుల్లో రమేష్, పాండురంగారావుకు కూడా గాయాలయ్యాయి. దీనిపై పోలీసులకు పరస్పరం ఫిర్యాదులు చెయ్యగా రెండవ పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కోడిపందేల స్థావరంపై దాడి

ఉదయగిరి రూరల్, జనవరి 16: మండలంలోని జీ.చెర్లోపల్లి పంచాయతీ వడ్డిపాళెం చెరువు సమీపంలో నిర్వహిస్తున్న కోడిపందేల స్థావరంపై మంగళవారం తన సిబ్బందితో దాడులు నిర్వహించినట్లు ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి తెలిపారు. ఈ దాడిలో రెండు కోళ్లు, తొమ్మిది మంది పందెపురాయుళ్లతోపాటు రూ.12,760ల నగదు స్వాధీనం చేసుకొన్నట్లు ఆయన తెలిపారు.

కోళ్ల లారీ బోల్తా

● నలుగురికి గాయాలు ● కోళ్ల కోసం జనం పరుగులు

మనుబోలు, జనవరి 16: మండల పరిధిలోని మనుబోలు వంతెనపై మంగళవారం వేకువజామున జరిగిన ప్రమాదంలో కోళ్ల లారీ బోల్తా పడింది. చిత్తూరు జిల్లా పుంగనూరు నుంచి 1080 కోళ్లతో నెల్లూరుకు వస్తున్న మినీలారీని మరో లారీ అధిగమించి ముందుకు వచ్చి హఠాత్తుగా బ్రేక్ వేయడంతో కోళ్ల లారీ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ సుజిత్, క్లీనర్ సందీప్‌తో పాటు మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. కోళ్ల లారీ బోల్తా పడిందన్న విషయం తెలియగానే స్థానికులంతా హైవేకి చేరుకున్నారు. సందట్లో సడేమియా అంటూ చేతికి చిక్కినన్ని కోళ్లను పట్టుకెళ్లారు. మరోలారీలో కోళ్లను ఎక్కించి నెల్లూరుకు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



లారీ నుంచి కోళ్లు పట్టుకెళుతున్న స్థానికులు

రైలు కింద పడి ఇద్దరి మృతి

నెల్లూరు(క్రైం),జనవరి 16: గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు ఆదివారం అర్ధరాత్రి రైలు కింద పడి మృతి చెందారు. పడుగుపాడు-నెల్లూరు ప్రధాన రైల్వేస్టేషన్ మధ్య పెన్నా రైల్వే గేటు వద్ద రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. 60 నుంచి 65 ఏళ్ల వయసు కలిగి, ఆరెంజ్ రంగు హాఫ్ హ్యాండ్స్ షర్టు, బ్లూ, తెలుపు రంగు గళ్ల లుంగీ ధరించిన వ్యక్తి మృతి చెందినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. అలాగే, వెంకటాచలం-వేదాయపాళెం రైల్వే స్టేషన్ల మధ్య అయ్యప్పగుడి ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద రైలు ఢీకొని మరో వ్యక్తి మృతి చెందాడు. 60 నుంచి 65 ఏళ్ల వ్యక్తి మృతి చెందాడని, మృతదేహంపై బ్లూ రంగు మీద ఊదా రంగు గళ్ల ఫుల్‌హ్యాండ్స్ షర్టు, బ్లూ, ఆరెంజ్ రంగుగళ్ళ లుంగీ ఉన్నాయని రైల్వే ఎస్ఐ ఎన్ హరిచందన తెలిపారు. మృతదేహాలను జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.



గుర్తుతెలియని మృతదేహం

రైల్వే స్టేషన్‌లో విస్తృత తనిఖీలు

నెల్లూరు(క్రైం), జనవరి 16: గుంతకల్లు ఎస్ఆర్పీ కే చౌడేశ్వరి ఉత్తర్వుల మేరకు ఐఆర్పీ కే భుజంగరావు, ఎస్ఐలు ఎన్ హరిచందన, జీ మాలకొండయ్య, ఆర్పీఎస్ సిబ్బంది నెల్లూరు నగరంలోని ప్రధాన రైల్వే స్టేషన్‌తోపాటు అన్ని రైల్వే స్టేషన్లను సోమ, మంగళవారాలు విస్తృతంగా తనిఖీ చేశారు. భుజంగరావు మాట్లాడుతూ సంక్రాంతి పండుగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేశామని చెప్పారు. ఎన్నికల దృష్ట్యా రైళ్లలో అక్రమంగా మద్యం, మాదకద్రవ్యాలు, డబ్బు తరలించే అవకాశం ఉన్నందును తనిఖీలు కొనసాగిస్తామని తెలిపారు.

సర్వే రాళ్లకు దిక్కేది ?

● కార్యరూపం దాల్చని జగనన్న భూరక్ష పథకం ● పొలాల్లోని కనిపించని హద్దు రాళ్లు ● ఏర్పాటుకు ఆసక్తి చూపని రైతులు

కోవూరు, జనవరి16 : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న భూ రక్షా పథకం కోవూరు నియోజకవర్గంలో కార్యరూపం దాల్చలేదు. జగనన్న భూ రక్షా సర్వేను సర్వే అధికారులు చేపట్టినా రాళ్లు ఏర్పాటుచేయడంలో విఫలమయ్యారు. కోవూరు, కొడవలూరు, విడవలూరు మండలాల్లో సర్వేరాళ్లు పొలాల్లో కనిపించడంలేదు. సర్వేరాళ్లను తమ పొలాల్లో నాటేందుకు రైతులు శ్రద్ధ తీసుకొనకపోవడంతో ఎక్కడి సర్వే రాళ్లు అక్కడే కన్పిస్తున్నాయి. పొలాల గట్లపై. కాలువల పక్కన దర్శనమిస్తున్నాయి. కొన్ని గ్రామాల్లోని రైతులు పాతిన రాళ్లను తొలగిస్తున్నారు.



పొలాల్లో నాటేందుకు తోలిన సర్వే రాళ్లు

● తొలగిస్తున్న వైనం

తమ పూర్వీకులు సంపాదించిన పొలానికి సరిహద్దుగా సీఎం జగన్మోహనరెడ్డి పేరుతో సర్వే రాళ్లను నాటడమేమిటని ప్రశ్నించి తొలగిస్తున్నారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చించి సిద్ధం చేసిన సర్వేరాళ్లు పొలాల్లో దిష్టిబొమ్మలుగా కన్పిస్తున్నాయి. కోవూరు మండల పరిధిలోని మోడేగుంట, వేగూరు, విడవలూరు మండల పరిధిలోని విడవలూరు, పార్లపల్లి, కొడవలూరు మండల పరిధిలోని మానేగుంటపాడు, ఆలూరుపాడు గ్రామాల పొలిమేరల్లో సర్వేరాళ్ళు గుట్టలుగుట్టలుగా దర్శనమిస్తున్నాయి. రైతుల్లో జగనన్న భూ రక్షా సర్వే రాళ్ళు ఏర్పాటుపై వ్యతిరేకత కనపడుతోంది. దీంతో రెవెన్యూ అధికారులు జగనన్న భూరక్షా సర్వే రాళ్ళు పాతడంలో శ్రద్ధ చూపడంలేదని తెలిసింది. ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చించి ప్రవేశపెట్టిన జగనన్న భూ రక్షా సర్వే రాళ్ళ పథకం నియోజకవర్గంలో నీరుకారిపోయింది.

లోపభూయిష్టం

మా పూర్వీకుల పొలంలో జగనన్న భూరక్షా సర్వే రాళ్లు పాతడం కరెక్టు కాదు. రైతులు కష్టపడి పొలం సంపాదించుకుంటే ప్రభుత్వం జగన్ ఫొటోతో రాళ్ళను నాటడమేమిటి ? జగనన్న భూ రక్షా సర్వే రాళ్ళ పథకమే లోపభూయిష్టంగా ఉంది. కోట్లాది రూపాయల ప్రజాధనం దుర్వినియోగమైంది.



-ఇంతా మల్లారెడ్డి, రైతు నాయకుడు, కోవూరు

ప్రజాధనం దుర్వినియోగం

జగనన్న భూరక్షా సర్వే రాళ్లు ఏర్పాటుకు రైతుల్లో శ్రద్ధలేదు. మా పొలంలో సీఎం జగన్మోహన్‌రెడ్డి ఫొటోతో సర్వేరాళ్లు నాటడమేమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు. సర్వే రాళ్లు ఏర్పాటులో అధికారులు కూడా శ్రద్ధ పెట్టడంలేదు. ప్రజా ధనం దుర్వినియోగమవుతున్నా పట్టించుకోవడం లేదు.



-గండవరపు శేషయ్య, రైతు నాయకుడు

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	123
లేయర్ లైవ్	85
స్కిన్ చికెన్	220
స్కిన్‌లెస్	246
లేయర్	145

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ. 5962
వెండి కిలో ధర	రూ. 73,600
వెండి ఒక గ్రాము	రూ. 75.60

వృద్ధాశ్రమం ఏర్పాటు

పొదలకూరు : పొదలకూరు పంచాయతీ పరిధి లింగంపల్లి తోపు గ్రామ సమీపంలో ఆగ్నేష్ మల్టీపర్పస్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో వృద్ధుల ఆశ్రమం, స్కిల్ డెవలప్‌మెంట్ భవన ప్రారంభోత్సవం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా అమెరికాకు చెందిన ఫాదర్ జోసెఫ్ మైఖేల్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సురేష్‌రెడ్డి, రాంబాబు, కిరణ్, లక్ష్మణ్‌బాబు, శ్రీనివాసులు, రమణయ్య, బాలస్వామి, సందీప్ పాల్గొన్నారు.

మోతాదుకు మించి యూరియా వాడితే..

● చీడపీడల బెడద ● దిగుబడులపైనా ప్రభావం ● ఆపై పెట్టుబడుల భారం ● ఆత్మ పీడీ దొరసాని

నెల్లూరు(వ్యవసాయం), జనవరి 16: పైరు పచ్చగా, ఏపుగా పెరగడం.. ఎక్కువ పిలకలు చేసి అధిక దిగుబడులు రావడానికి నత్రజని పోషకం ఎంతో ముఖ్యం. ఆ నత్రజని పోషకాన్ని అందించగలిగే ఎరువుల్లో తక్కువ ధరకు లభించేది యూరియా. అయితే దీన్ని వ్యవసాయ శాస్త్రవేత్తలు సిఫారసు చేసిన మోతాదులో వాడితే పైరుకు ఎంతో మంచిది. ఆశించిన దిగుబడులు లభిస్తాయి. కానీ మోతాదుకు మించి వాడడం వల్ల చీడపీడలు ఆశిస్తాయి. దీంతో పురుగు మందుల వాడకం పెరుగుతుంది. పెట్టుబడులు పెరుగుతాయి. అంతేకాక ఆశించిన దిగుబడులు సైతం రావని ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ యస్.దొరసాని పేర్కొన్నారు. అధిక యూరియా వాడడం వల్ల కలిగే దుష్ఫలితాలను ఆమె ఆంధ్రజ్యోతికి వివరించారు.

● చిన్నగాలులకే పైరు పడిపోతుంది..

రైతులు అధిక దిగుబడులు సాధించాలని, పైరు పచ్చగా ఉండాలని మోతాదుకు మించి యూరియాను వాడేస్తున్నారు. దీనివల్ల పైరుకు అందే పోషకాల సంగతి పక్కన పెడితే దుష్ఫలితాలే ఎక్కువగా ఉంటాయి. పైరు ఏపుగా పెరగడం వల్ల దుబ్బు గట్టిగా లేక చిన్నచిన్న గాలులకు కూడా పైరు పడిపోతుంది. పైరు ముదురు ఆకుపచ్చ రంగులోకి మారడం, మృదుత్వంగా మారడం వల్ల పురుగులు, తెగుళ్లు ఆశించేందుకు దోహదపడతాయి. వీటి నివారణకు పురుగు, తెగుళ్ల మందులు పిచికారీ చేయాల్సి ఉంటుంది. దీని వల్ల పెట్టుబడులు మరింత పెరిగిపోతాయి. అంతేకాకుండా పంట కాలం పెరిగి అంటే శాఖీయ దశ పెరిగి ప్రత్యుత్పత్తి దశ తగ్గి గింజలు పాలుపోసుకోక తాలు గింజలు ఏర్పడతాయి. దీంతో దిగుబడులు తగ్గిపోతాయి. కలుపు మొక్కలు సైతం పంటతో పోటీపడి పోషకాలను తీసుకోవడం వల్లకూడా దిగుబడులపై ప్రభావం చూపుతుంది. సిఫారసు చేయబడిన నత్రజనిని యూరియా రూపంలో మూడు లేదంటే నాలుగు దఫాలుగా వేయడం వల్ల నత్రజని వినియోగం పెరుగుతుంది. రబీ సీజన్‌లో ఎకరా వరి పైరుకు 48 కేజీలు, వేరుశనగకు 12 కేజీలు సరిపోతాయి. ఈమోతాదులో యూరియాను వినియోగించడం వల్ల ఖర్చులు తగ్గడంతోపాటు నాణ్యమైన దిగుబడులు పొందవచ్చు. ప్రత్యామ్నాయంగా పైపాటుగా నానో యూరియాను రెండు నుంచి మూడు దఫాలుగా ఎకరాకు 500మి.లీ చొప్పున పిచికారీ చేసి నత్రజనిని అందించవచ్చు.



● నత్రజని పోషకాలు పొందేందుకు..

పశువుల ఎరువు, కంపోస్టు, కోళ్ల ఎరువు, రసాయనికి ఎరువులతో కలిపి వాడినట్లయితే 20 నుంచి 25శాతం నత్రజనిని ఆదా చేయవచ్చు. వరి మాగాణాల్లో ఆపరాలు, జీలుగ, జనుము, పిల్లిపెసర, అలసంద లాంటి పచ్చిరొట్ట పైరులను పెంచి కలియదున్నవడం వల్ల భూసారం పెరగడమే కాకుండా దాదాపు 20 నుంచి 25శాతం రసాయనిక ఎరువుల మోతాదును ఆదా చేయవచ్చు. జీవన ఎరువులైన అజోల్లా, అజోస్పైరిల్లం, ఫాస్ఫో బ్యాక్టీరియా (పీఎస్‌బీ) లాంటి వాటిని వాడడం వల్ల రసాయనిక ఎరు వుల వాడకాన్ని 10 నుంచి 20శాతం తగ్గించవచ్చునని ఆమె ఈ సందర్భంగా ఆంధ్రజ్యోతికి వివరించారు.

వైభవంగా గిరి ప్రదక్షిణ ప్రారంభం

సంగం, జనవరి 16: స్థానిక పెన్నానది ఒడ్డున వెలసి ఉన్న కామాక్షి సమేత సంగమేశ్వరస్వామి గిరి ప్రదక్షిణ మంగళవారం ప్రారంభమయింది. ప్రతి ఏటా కనుమ రోజు సంగమేశ్వరుడు ఆలయం నుంచి బయలుదేరి సంగం కొండ వెనుక ఎత్తిపోతల పథకం దారి గుండా కొరిమెర్ల, తలుపూరుపాడు, తరుణవాయి గ్రామాల్లో గ్రామోత్సవం జరుగుతుంది. అనంతరం స్వామివారు మరుసటిరోజు ఆలయానికి చేరుకుంటారు.దీంతో గ్రామోత్సవం సంగం కొండ చుట్టు సుమారు 13 కిలోమీటర్లు తిరిగి వచ్చినట్లవుతుంది. స్వామి,అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను పులి వాహనంపై ఉంచి గజ పూలమాలలతో అలంకరించారు. అనంతరం సంగంలోని ఆంజనేయస్వామి ఆలయంలో విడిది దిగారు. ఈ సందర్భంగా ఆలయంలో పండరి భజన, కోలాటాలు ఏర్పాటు చేశారు. తరువాత స్వామి వారిని కొండ మలుపు వరకు తీసుకెళ్లి కొరిమెర్ల గ్రామస్థులకు అప్పగించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, వివిధ గ్రామాల భక్తులు తదితరులు పాల్గొన్నారు.



గిరి ప్రదర్శనకు బయలుదేరిన సంగమేశ్వరుడు

పండుగ సంబరాల్లోనూ ఓట్లపైనే ధ్యాస

కావలి, జనవరి 16: ఇది ఎన్నికల సంవత్సరం కావడంతో ప్రతి అవకాశాన్ని రాజకీయ నాయకులు తమకు అనుకూలంగా మలచుకుంటున్నారు. కావలి నియోజకవర్గంలో రెండు పార్టీలలో ఆశావహులు ఎక్కువగా ఉన్నారు. వారు ప్రజలలో తమ ప్రాబల్యాన్ని పెంచుకునేందుకు వచ్చిన ప్రతి అవకాశాన్ని అందిపుచ్చుకుంటున్నారు. ప్రస్తుతం నియోజకవర్గంలో టీడీపీ టికెట్‌ను మాలేపాటి సుబ్బానాయుడు, కావ్య కృష్ణారెడ్డి, పసుపులేటి సుధాకర్‌లు ఆశిస్తున్నారు. వైసీపీ టికెట్‌ను రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఆశిస్తుండగా, రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు పేరు కూడా పరిశీలనలో ఉంది. ఇదిలా ఉండగా మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి పార్టీ పేరు చెప్పకుండా ఏదో ఒక పార్టీ నుంచి తన పేరు బ్యాలెట్ పేపరులో ఉంటుందని చెబుతున్నారు. కావలి, అల్లూరులలో జరిగిన పోలేరమ్మ తిరునాళ్లలో ఓటర్లను ఆకట్టుకునేలా రాజకీయ నాయకులు తమ కార్యకలాపాలను సాగించారు. అలాగే కావలిలో సంక్రాంతి సంబరాలు, కలుగోళ్ల శాంభవి అమ్మవారి తిరునాళ్లకు సంబంధించిన సాంస్కృతిక కార్యక్రమాలలో నేతలు పోటీలు పడ్డారు. గతంలో ఎన్నడూలేని విధంగా నేతలు తమ ఇళ్ల వద్ద మహిళలచే గొబ్బెమ్మల కార్యక్రమాలను ఏర్పాటు చేయించుకున్నారు. కలుగోళ్ల శాంభవి తిరునాళ్ల సందర్భంగా జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలలో ఇరు పార్టీల నేతలు చందాలు భారీగా ఇవ్వడమే కాక కార్యక్రమాలలో పాల్గొని తమ హవా చూపించారు. ఈ తిరునాళ్లలో సాంస్కృతిక కార్యక్రమాల కన్నా నేతల హడావిడే ఎక్కువగా కనిపించింది. నిర్వాహకులు కూడా నేతల ఫ్లెక్సీలతో ఆ ప్రాంతాన్ని నింపివేయటంతో పండుగ వాతావరణం కన్నా ఎన్నికల వాతావరణమే ఎక్కువగా కనిపించింది. ఆధ్యాత్మిక వేదికలపై నిర్వాహకులు నేతలను పొడగటం చూస్తే ఎన్నికల సభలను తలపించాయి.

బుచ్చికి చేరిన ఆదివాసీల సైకిల్ యాత్ర

బుచ్చిరెడ్డిపాళెం, జనవరి16: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సరిహద్దుల్లోని శ్రీశైలం సమీపంలోని చిరుత జాతికి చెందిన ఆదివాసీల సైకిల్ యాత్ర మంగళవారం రాత్రి బుచ్చికి చేరుకుంది. అడవి బిడ్డల జీవితాల్లో వెలుగు నింపాలన్న ఉద్దేశంతో సైకిల్ యాత్ర చేపట్టినట్లు యాత్రా నిర్వాహకులు వంశీధర్ తెలిపారు. చిరుత జాతిలో చిన్నారులంతా విద్యకు దూరంగా వున్నారని, ఒక శాతం మాత్రమే విద్యకు అర్హులయ్యారని తెలిపారు. ఈనెల 13నుంచి చేపట్టిన ఈ యాత్ర కన్యాకుమారి వరకు కొనసాగిస్తామన్నారు.

రోడ్డు ప్రమాదంలో వీఆర్వో మృతి

దగదర్తి(బిట్రగుంట), జనవరి 16: దగదర్తి మండలం సున్నపుబట్టి ఆర్‌అండ్‌బి రోడ్డుపై వీఆర్వోగా పనిచేస్తున్న బండ పుల్లారావు (48) మంగళవారం రాత్రి మృతి చెందాడు. స్థానిక ఎస్సై విజయకుమార్ వివరాల మేరకు అల్లూరు మండలానికి చెందిన పుల్లారావు దగదర్తి, వెలుపాడు గ్రామపంచాయతీల వీఆర్వోగా విధులు నిర్వహిస్తున్నారు. అదే క్రమంలో విధులు నిర్వహించుకుని తిరిగి వెళుతుండగా ప్రమాదవశాత్తు బైక్ అదుపు తప్పి పడిపోవడంతో తలకు బలమైన గాయమై మృతిచెందారు. విషయం తెలుసుకున్న ఎంపీపీ తాళ్ళూరు కృష్ణప్రసాద్ నాయుడు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. పుల్లారావు మృతదేహాన్ని కావలి ఏరియా వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వీఆర్వో పుల్లారావు

గూడూరు ప్రజలకు అందుబాటులో ఉంటా.. !

● ఎమ్మెల్సీ మేరిగ మురళి

రాపూరు(డక్కిలి), జనవరి 16 : గూడూరు నియోజకవర్గ ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉండి వారికి సేవ చేస్తానని ఎమ్మెల్సీ, గూడూరు వైసీపీ ఇన్‌చార్జి మేరిగ మురళీధర్ రావు అన్నారు. మంగళవారం ఆయన వైసీపీ సీనియర్ నాయకులు పాపకన్ను మధుసూదన రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం తూమాయి గ్రామ సమీపంలోని పోతుగుంట అంకమ్మ ఆలయంలో అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఆయన వెంట వైసీపీ మండల కన్వీనర్ పాపకన్ను దయాకరరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ నారాయణరెడ్డి, నాయకులు శ్రీకర్‌రెడ్డి శశిధర్‌రెడ్డి, పెంచలరెడ్డి, బాలకృష్ణారెడ్డి, కోటేశ్వరరెడ్డి, నారసింహారెడ్డి, ఉమామహేశ్వరరెడ్డి, లీలామోహన్‌రెడ్డి, కలపాటి మధుసూదనరెడ్డి, రమణయ్య, అబ్దుల్ గని ఉన్నారు.

కోలాహలంగా రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు

● మొదటి మూడు స్థానాలు సాధించిన కడప జిల్లా ఎడ్లు

జలదంకి, జనవరి 16: సంక్రాంతిని పురస్కరించుకుని ప్రతీ ఏడాది జలదంకి మండలం బ్రాహ్మణక్రాకలో నిర్వహించే జోడెద్దుల బండలాగుడు పోటీలు సోమవారం కోలాహలంగా జరిగాయి. గ్రామంలోని శివాలయం వద్ద ఈ పోటీలు జరగ్గా రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి యజమానులు ఎడ్లను పోటీలకు ప్రత్యేక వాహనాలలో తీసుకువచ్చారు. ఈ పోటీలను బ్రాహ్మణక్రాక నివాసి, మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్ రెడ్డి ప్రారంభించారు. పోటీలను తిలకించేందుకు వివిధ మండలాల నుంచి వేలాదిమంది తరలిరావడంతో పోలీసులు భద్రతా చర్యలు చేపట్టారు. ఈ పోటీలలో మొదటి మూడుస్థానాలు కడపజిల్లాకే దక్కాయి. ప్రథమ స్థానం మైదుకూరుకు చెందిన కుర్రా వెంకటేష్‌యాదవ్ ఎద్దులు దక్కించుకోగా మాజీ ఎమ్మెల్యే వంటేరు ఆయనకు రూ.50వేలు నగదు బహుమతి అందజేసి ఘనంగా సన్మానించారు. ద్వితీయ స్థానం వల్లూరు మండలం గోసులవారిపాలెంకు చెందిన పాపిరెడ్డి వెంకటరమణారెడ్డికి చెందిన ఎద్దులు దక్కించుకోగా రూ.40వేలు నగదు బహుమతిని నిర్వాహకులు అందించి రమణారెడ్డిని సన్మానించారు. తృతీయ స్థానంలో ఇదేజిల్లాకు చెందిన పోతిరెడ్డిపల్లెకి చెందిన మూలే ప్రసాద్ రెడ్డి ఎద్దులు నిలవగా రూ.30వేలు నగదు బహుమతిని నిర్వాహకులు అందించి ఆయనను సన్మానించారు. అదేవిధంగా నాలుగు, ఐదు స్థానాల్లో కూడా కడప జిల్లాకు చెందిన తొగిరిశెట్టి వెంకటేశ్వరశర్మ, వినుకొండ రఫీలకు చెందిన ఎడ్లు నిలవగా, వారికి రూ.20వేలు, రూ.15వేలు వంతున నగదు బహుమతిని అందించి సత్కరించారు. పోటీలో పాల్గొన్న ప్రతీ ఎడ్ల జతకు ప్రోత్సాహక బహుమతిని నిర్వాహకులు అందించారు. ఈ పోటీలకు ముఖ్యంగా యువత, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు ఆర్థిక చేయూత అందిస్తుండడంతో వీరి కి తోడుగా మాజీ ఎమ్మెల్యే వంటేరు నిలిచి వారిని పోత్సహిస్తున్నారు. దీంతో నిర్వాహకులు వంటేరును ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిర్వాహకులు కట్టుదిట్టమైన ఏర్పాట్లుచేశారు.



బండలాగుతున్న ఎడ్లు



మొదటి స్థానం సాధించిన ఎడ్ల యజమాని కుర్రా వెంకటేష్‌యాదవ్‌ను సన్మానిస్తున్న వంటేరు

నెల్లూరు రైల్వే స్థలం లీజుకు..!

● వాణిజ్య అవసరాలకు 4296.52 చ.అ. ● 45 ఏళ్లు లీజుకు, రిజర్వు ధర రూ.9కోట్లు ● బిడ్లు ఆహ్వానించిన ఆర్ఎల్‌డీఏ సంస్థ ● ఈనెల 25 వరకు గడువు

నెల్లూరు (వెంకటేశ్వరపురం), జనవరి 16 : నెల్లూరు ప్రధాన రైల్వే స్టేషన్ పరిధిలోని స్థలాలను వ్యాపార అభివృద్ధికి లీజుకు ఇచ్చేందుకు దక్షిణ మధ్య రైల్వే నిర్ణయించింది. ఇప్పటికే దాదాపు రూ.102 కోట్లతో ప్రధాన రైల్వే స్టేషన్‌లో శరవేగంగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో రైల్వే స్టేషన్‌కు సమీపంలోని ఆత్మకూరు బస్టాండ్ కూడలిలో గతంలో పెట్రోల్ బంకు ఉన్న స్థలాన్ని లీజుకు ఇవ్వనున్నారు. సుమారు రూ.9 కోట్ల విలువైన 4296.52 చదరపు అడుగుల స్థలాన్ని 45 ఏళ్ల కమర్షియల్ డెవలప్‌మెంట్ లీజుకు ఇవ్వనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. ఇందుకోసం ఈ నెల 8 తేదీ నుంచి ఆన్‌లైన్‌లో బిడ్‌లను ఆహ్వానించింది. ఈ నెల 25 తేదీ వరకు గడువు ప్రకటించింది. ఈ ప్రక్రియనంతా ఆర్ఆల్‌డీఏ(రైల్ లాండ్ డెవలప్‌మెంట్ అథారిటీ) పర్యవేక్షణలో నిర్వహిస్తున్నారు. దేశవ్యాప్తంగా అనేక రైల్వే స్టేషన్లలో స్థలాలను ప్రైవేటు వారికి లీజుకు ఇచ్చి అభివృద్ధి చేస్తున్నారు. అదేవిధంగా పారిశ్రామికంగా శరవేగంగా అభివృద్ధి చెందుతున్న నెల్లూరులో కూడా రైల్వే స్థలాలను లీజుకు ఇవ్వనున్నట్లు ఆర్ఎల్‌డీఏ ఛైర్మన్ వేద్‌ప్రకాష్ దూదేజా తెలిపారు. త్వరలోనే నెల్లూరు రైల్వే స్టేషన్ సుందరంగా మారుతుందన్నారు.



అభివృద్ధి పనులు జరుగుతున్న నెల్లూరు ప్రధాన రైల్వేస్టేషన్

జీవాలకు రక్త నమూనాల సేకరణ



రక్త పరీక్షలు చేస్తున్న సిబ్బంది

ఉదయగిరి, జనవరి 16: మండలంలోని కొండాయపాళెంలో జీవాలకు పశు సంవర్ధక శాఖ సిబ్బంది సోమవారం రక్త పరీక్షలు నిర్వహించారు. ఆంధ్రజ్యోతిలో 'అంతుచిక్కని వ్యాధితో జీవాలు మృతి' అనే కథనం ప్రచురితమైంది. దీంతో ఆ శాఖ సహాయకులు ఖాజామొహిద్దీన్, కోనయ్యలు అక్కడికెళ్లి రక్త పరీక్షలు నిర్వహించి, వ్యాక్సినేషన్ చేశారు. జీవాల పోషణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై యజమానులకు సూచించారు. అయినా జీవాల మృతి ఆగలేదని మరో రెండు జీవాలు మృతిచెందాయని యజమానులు తెలిపారు.

గ్రామ పంచాయతీలపై నిర్వహణ భారం

● సచివాలయాలకు నిధులు ఇవ్వని ప్రభుత్వం ● ఖర్చులు భరిస్తున్న కార్యదర్శులు

సంగం, జనవరి 16: జిల్లాలోని 38 మండలాల్లో 722 గ్రామ పంచాయతీలు ఉన్నాయి ఇందులో జనాభాను బట్టి 659 సచివాలయాలు ఏర్పాటు చేశారు. సంగం మండలంలో 20 పంచాయతీలకుగాను 13 సచివాలయాలు ఉన్నాయి. వీటిలో రెండు వేల కంటే తక్కువ జనాభా ఉన్న పంచాయతీలే అధికం. వీటికి ఆదాయం అంతంత మాత్రమే. దీనికి తోడు సచివాలయ నిర్వహణ బాధ్యతలను పంచాయతీలకే అప్పగించారు. గ్రామ సచివాలయాల నిర్వహణకు ప్రభుత్వం రూపాయి కూడా విదల్చడం లేదు. సేవా రుసుం రూపంలో వచ్చిన ఆదాయంలో కనీసం 10 శాతం కూడా విడుదల చేయడం లేదు.



సంగంలోని గ్రామ సచివాలయ కార్యాలయం

● ప్రతి నెలా ఖర్చు రూ.ఐదు వేలకు పైమాటే...

గ్రామ సచివాలయాల నిర్వహణకు ప్రతి నెలా రూ. 5వేలకు పైగా ఖర్చవుతుంది. ఇదంతా గ్రామ పంచాయతీలపై అదనపు భారం పడుతుంది. ఇంటి పన్నుల ద్వారా వచ్చే ఆదాయం పారిశుధ్య కార్మికుల వేతనాలు, వీధిలైటు తదితర ఖర్చులకే సరిపోవడంలేదు. అంతేకాక కేంద్ర ప్రభుత్వం నుంచి వస్తున్న 15వ ఆర్థిక సంఘం నిధులను తాగునీటి పథకాలకు, విద్యుత్ బకాయిలకు సర్దుబాటు చేస్తున్నారు. దీంతో ఆదాయం లేని పంచాయతీల్లో నిధుల కొరత వెంటాడుతుంది. ఖర్చులను కొన్ని పంచాయతీల్లో ఆయా సర్పంచిలు వ్యక్తిగత పరపతి కోసం భరిస్తున్నారు. ఈ క్రమంలో గ్రామంలో ఎక్కడైనా తాగునీటి సమస్య తలెత్తితే పంచాయతీ కార్యదర్శులు కూడా వచ్చుండ స్తుగా కొంత డబ్బును వెచ్చించాల్సి వస్తోంది. అనుమతి వచ్చిన అనంతరం బిల్లులు పెట్టి తీసుకుంటున్నారు. గ్రామ, వార్డు సచివాలయాలకు కంప్యూటర్లు, ప్రింటర్లు ఇతర సామగ్రిని ప్రభుత్వం సమకూర్చింది. సచివాలయాల్లో వివిధ సేవలకు ప్రింట్లు తీయడానికి అవసరమైన స్టేషనరీకి రూ. 3 వేలు వరకు ఖర్చు అవుతుంది. ఇతర సామగ్రి, స్టేషనరీ, విద్యుత్ బిల్లుల నిర్వహణకు సగటున ఒక్కొక్క పంచాయతీపై నెలకు ఐదువేల వరకు భారం పడుతుంది. దీంతో పంచాయతీ కార్యదర్శులు వారి జీతాల నుంచే సర్దుబాటు చేస్తున్నారు.

● కార్యక్రమాల నిర్వహణతో మరింత భారం

ఈ నేపథ్యంలో ఇటీవల ప్రభుత్వం తరచుగా జగనన్న ఆరోగ్య సురక్ష, ఏపీ నీడ్స్ జగనన్న వంటి పలు కార్యక్రమాలను నిర్వహించాలని ఆదేశించింది. అంతేకాకుండా ఇప్పుడు జరుగుతున్న ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల నిర్వహణ ఏర్పాట్లు కూడా వీరిపైన రుద్దారు. దీంతో వీటికి అవసరమైన టెంట్లు, కుర్చీలు, తాగునీరు, టీ, స్నాక్స్, భోజనాలకు నిధులు ఇస్తామని ప్రభుత్వం చెబుతున్నా కార్యక్రమం అయిన తరువాత ఇచ్చే వాటిల్లో కోత విధిస్తోంది. ప్రభుత్వం స్పందించి సచివాలయాలకు వచ్చే సేవా రుసుం నుంచి ప్రతి నెలా సచివాలయాల నిర్వహణకు నిధులు కేటాయించాలి.

వాడవాడలా సంక్రాంతి సంబరాలు



సంగం : చెన్నవరపాడులో భద్రకాళీ సమేత వీరభద్రేశ్వరస్వామి గ్రామోత్సవం



కలిగిరి : గోదాదేవి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

కందుకూరు, జనవరి 16: సంక్రాంతి పర్వదినాన్ని కందుకూరు ప్రాంతంలో ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. సోమవారం సంక్రాంతి సందర్భంగా ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముగ్గుల పోటీలు నిర్వహించి మహిళలకు బహుమతులు అందజేశారు. క్రికెట్, కబడ్డీ పోటీలు, చిన్నారులకు స్లో సైక్లింగ్, మ్యూజికల్ చైర్స్ లాంటి పోటీలు నిర్వహించి గ్రామ కమిటీల ఆధ్వర్యంలో బహుమతులు అందజేశారు. కందుకూరు సమీపంలోని కాకుటూరు వద్ద ముగ్గుల పోటీలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మంగళవారం కనుమ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. బీజేపీ ఆధ్వర్యంలోను సంక్రాంతి సందర్భంగా వివిధరకాల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

వలేటివారిపాలెం: మండలంలోని కాకుటూరులో నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో సోమవారం నియోజకవర్గ స్థాయి ముగ్గుల పోటీలు ఉత్సాహంగా జరిగాయి. పోటీలలో సుమారు 173 మంది మహిళలు పాల్గొన్నారు. పోటీలలో కందుకూరు మండలం ఓగూరు గ్రామానికి చెందిన శివరాత్రి సులోచన మొదటి బహుమతి వాషిగ్ మిషన్, రెండవ బహుమతి దామా ఉమామహేశ్వరి ఫ్రిజ్, మూడవ బహుమతి ఉలవపాడుకు చెందిన ఓసూరు పద్మావతి ఎల్‌ఈడీ టీవీ గెలుపొందారు. అంతేగాకుండా ముగ్గుల పోటీలలో పాల్గొన్న ప్రతి మహిళకు కన్సోలేషన్ బహుమతులు అందజేశారు. విజేతలకు నాగేశ్వరావు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకురాలు ఉన్నం నళినీదేవి, మండల టీడీపీ అధ్యక్షుడు మాదాల లక్ష్మీనరసింహం, టీడీపీ నాయకులు పొడపాటి నరసింహం, పొడపాటి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

అల్లూరు : భోగి, సంక్రాంతి, కనుమ పండుగలను మండలంలో ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర స్వగ్రామమైన ఇస్కపల్లిలో అందుబాటులో ఉండడంతో మండలం లోని నాయకులంతా ఆయన్ను కలుసుకొని పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీద గిరిధర్, దువ్వూరు శేఖర్‌రెడ్డి, పెనుమల్లి శ్రీనివాసులురెడ్డి, అరగల రమణయ్య, గోళ్ల వెంకటేశ్వర్లు, మేడా శ్రావణ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొండాపురం : సంక్రాంతి పండుగను మండల ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేసి స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. మంగళవారం కనుమ పండుగ సందర్భంగా పశువులకు అలంకరణ చేశారు. సాయిపేట పంచాయతీ వెల్లటూరివారిపాలెంలో భక్తులు కోలాటం నిర్వహించారు.

ఉలవపాడు : సంక్రాంతి, కనుమ పండుగ సంబరాలు పల్లెల్లో ఘనంగా జరుపుకున్నారు. రంగుల హరివిల్లు ముగ్గుల పోటీలలో స్థానిక మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. కొల్లూరుపాడు ఎస్సీ కాలనీలో సంక్రాంతి పండుగ రోజు ముగ్గుల పోటీలు నిర్వహించి మొదటి మూడు స్థానాల్లో నిలిచిన ఎద్దు సుష్మలత, వెలిచర్ల పుష్పశ్రీ, దామతోటి మహాలక్ష్మీలకు బహుమతులు అందచేశారు. అదేవిధంగా ఉలవపాడు ఎస్సీ కాలనీలో కూడా ముగ్గుల పోటీలు నిర్వహించారు.

ఆత్మకూరు: నియోజకవర్గంలో సంక్రాంతి సంబరాలు వైభవంగా జరిగాయి. ఆలయాలు ప్రత్యేక శోభను సంతరించుకున్నాయి. గ్రామ దేవతలకు ప్రత్యేక ఉత్సవాలు నిర్వహించారు. అలాగే క్రికెట్, ముగ్గుల పోటీలతో పాటు గొబ్బెమ్మల ఆటపాటలను సాగించారు. సోమవారం పెద్దపండుగను పురస్కరించుకుని పట్టణంలోని శివాలయం, తిరునాళ్లతిప్పలో వెలసి ఉన్న అయ్యప్పస్వామి ఆలయంలో అయ్యప్పభక్తులు మకరజ్యోతిని వెలిగించి పూజలు నిర్వహించారు. వెంకటేశ్వరస్వామి, అలఘనాథస్వామి, కన్యకాపరమేశ్వరి ఆలయాల్లో భక్తులు పోటెత్తారు. శ్రీకృష్ణసేవాసమితి ఆధ్వర్యంలో కృష్ణమందిరం వద్ద నిర్వహించిన ముగ్గుల పోటీలు అలరించాయి. ముఖ్య అతిథిగా విచ్చేసిన మాజీ జడ్పీటీసీ సభ్యుడు డాక్టర్ సీహెచ్ ఆదిశేషయ్య విజేతలకు బహుమతులు అందజేశారు.

సంగం: మండలంలోని అన్ని గ్రామాల్లో సంక్రాంతి, కనుమ పండుగను ఆనందంగా జరుపుకున్నారు. సోమవారం నాడు సంక్రాంతి పండుగను ఇంటిల్లపాది భక్తి శ్రద్ధలతో పూజలు చేసి జరుపుకున్నారు. అలాగే రాళ్లచెలిక వీవర్స్ కాలనీలో సంక్రాంతిని పురస్కరించుకుని సమరసతా ఫౌండేషన్ ఆధ్వర్యంలో, చెక్‌పోస్టు కాలనీలో మాతా పరమేశ్వరీదేవి ఆలయం వద్ద మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. గునుపూడి ట్రేడర్స్ నిర్వాహకులు గిరి విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు ప్రదానం చేశారు. ఈ పోటీల్లో మహిళలు పాల్గొన్నారు.

మహాలక్ష్మమ్మ మానుకు పూజలు

మండలంలోని వెంకటేశ్వరపురం గ్రామంలో వెలసి ఉన్న మహాలక్ష్మమ్మ వేప మానుకు సోమవారం సంక్రాంతి (పెద్ద పండుగ)ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగ, వ్యాపార రీత్యా వివిధ ప్రాంతాలకు వలస వెళ్లినవారు గ్రామానికి వచ్చారు. దీంతో గ్రామంలో సందడి నెలకొంది. ఈ సందర్భంగా వేపమానును గజ పూల మాలలు, విద్యుత్ దీపాలతో అలంకరించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వీరభద్రేశ్వరస్వామి గ్రామోత్సవం

మండలంలోని చెన్నవరపాడులో మకర సంక్రాంతిని పురస్కరించుకుని సోమవారం రాత్రి వీరభద్రేశ్వరస్వామి గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భద్రకాళీ సమేత వీరభద్రేశ్వర స్వామి ఉత్సవ విగ్రహాలను నంది వాహనంపై ఉంచి గజపూలమాలలతో అలంకరించారు. అనంతరం గ్రామ పురవీధుల్లో స్వామివారి గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఉదయగిరి: మండలంలో సోమవారం మకర సంక్రాంతి, మంగళవారం కనుమ పండుగను ఘనంగా జరుపుకున్నారు. మకర రోజు పెద్దల సమాధుల వద్ద వస్త్రాలు ఉంచి కాయాకర్పూరం సమర్పించి ఆశీర్వాదాలు పొందారు.

దుత్తలూరు(ఉదయగిరి రూరల్): సంక్రాంతి పండుగ రోజు ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు పెద్దల పండగను ఘనంగా నిర్వహించారు. కుటుంబ సభ్యులు వారి వారి పెద్దల సమాధుల వద్ద ఇష్టమైన పదార్థాలతో ప్రత్యేక పూజలు చేపట్టారు. కనుమ రోజున పశువులకు పూజలు నిర్వహించడంతో పాటు పంట పొలాల్లో శీతకుండలు ఏర్పాటు చేశారు.

అట్టహాసంగా ఎడ్ల బండలాగుడు పోటీలు

అనంతసాగరం: మండలంలోని కమ్మవారిపల్లి ధర్మపల్లెమ్మ ఆలయ ప్రాంగణంలో సంక్రాంతి పర్వదినం సందర్భంగా మంగళవారం ఎద్దులు బండలాగుడు పోటీలు అట్టహాసంగా జరిగాయి. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి ఏడు జతల ఎద్దులు ఈ పోటీల్లో పాల్గొనగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన ఎద్దులకు నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు.

బిట్రగుంట : బోగోలు మండలం తాళ్ళూరు పంచాయతీ చైతన్య నగర్‌లో సంక్రాంతి సంబరాల్లో భాగంగా మంగళవారం ట్రాక్టర్ ట్రిక్ వెనక్కు నడిపే పోటీలు జరిగాయి. మొదటి బహుమతి రూ. 3వేలు బిక్కం శ్రీనివాసులురెడ్డి, రెండో బహుమతి 2వేలు పోలుబోయిన వేణుగోపాల్, కుంచ మహేష్‌రెడ్డి మూడవ బహుమతి వెయ్యి రూపాయలు గెలుపొందారు. చైతన్యనగర్ యూత్ ఆధ్వర్యంలో విజేతలకు బహుమతులు అందచేశారు.

సీతారామపురం: జనసేన పార్టీ ఉదయగిరి నియోజక వర్గ నాయకులు బోగినేని కాశీరావు ఆధ్వర్యంలో సీతారామపురం స్థానిక ఎల్ వీ ఆర్ జూనియర్ కళాశాల ప్రాంగణంలో జనసేన పార్టీ మన ఊరు- మన ఆట అనే కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండల స్థాయిలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారామపురం సర్పంచ్ భాగ్యకుమారి, మాజీ జెడ్పీటీసీ కలివెల జ్యోతి ముగ్గులను పరిశీలించి విజేతల పేర్లను ప్రకటించారు.. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ కప్పు ప్రభాకర్ రాజు, టీడీపీ మండల క్లస్టర్ ఇన్‌చార్జి వెంగళశెట్టి వెంకటేశ్వర్లు, మండల ప్రధాన కార్యదర్శి పిడుగు రమేష్, జనసేన పార్టీ నాయకులు పాలిశెట్టి శ్రీనివాసులు,అల్లు రవీంద్ర, వితల నారాయణ, భుమన ఓముల్ రెడ్డి, ఏడుకొండలు, కోళ్ల నారాయణ పాల్గొన్నారు.

కలిగిరి, జనవరి 16: మండల ప్రజలు సంక్రాంతి, కనుమ పండుగలను ఘనంగా జరుపుకున్నారు. మంగళవారం స్థానిక కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో వేదపండితుల ఆధ్వర్యంలో నిర్వహించిన గోదాదేవి కల్యాణ వేడుకల్లో స్థానికులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. చిన్నారులు, యువకులు ఉత్సాహంగా గాలిపటాలను ఎగురవేశారు. అన్నదాతలు పాడిపశువులను అలంకరించి పూజలు చేశారు. అదేవిధంగా గ్రామదేవతలకు పొంగళ్ళు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



కందుకూరు: విజేతలకు బహుమతులు అందజేస్తున్న బీజేపీ, వీహెచ్‌పీ నాయకులు



వలేటివారిపాలెం: కాకుటూరులో ముగ్గుల పోటీల విజేతకు మొదటి బహుమతి అందజేస్తున్న ఇంటూరి నాగేశ్వరావు

వైభవంగా కలుగోళ శాంభవి గ్రామోత్సవం

కావలిటౌన్, జనవరి 16: కావలి పట్టణ గ్రామదేవతగా కొలువుదీరిన కలుగోళ శాంభవి అమ్మవారి గ్రామోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. సోమవారం రాత్రి ఆలయం వద్ద ప్రారంభమైన గ్రామోత్సవం పట్టణ పురవీధుల్లో మంగళవాయిద్యాలు, బాణాసంచా వేడుకలతో కనులపండువగా జరిగింది. మంగళవారం రాత్రి గ్రామోత్సవం తిరిగి ఆలయం వద్దకు చేరుకుంది. ప్రజలు అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.

జిల్లాస్థాయి చెడుగుడు పోటీల ప్రారంభం

బిట్రగుంట, జనవరి 16: బోగోలు మేజర్ పంచాయతీ కుమ్మర వీధిలో యూత్ ఆర్గనైజేషన్ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జరుగు జిల్లా చెడుగుడు పోటీలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా నిర్వాహకులు బోగిరి ప్రభాకర్, మేకల కిరణ్, ఎం మురళీ మాట్లాడుతూ సంక్రాంతి పండుగ పురస్కరించుకుని పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

ఫుట్‌బాల్ పోటీల విజేతలకు బహుమతులు

బిట్రగుంట, జనవరి 16: బోగోలు మండలం బిట్రగుంట లిటిల్ ఇంగ్లాండ్ ఫుట్‌బాల్ క్రీడా మైదానంలో జరిగిన అంతర్ రాష్ట్ర సంక్రాంతి ఇన్విటేషన్ ఫుట్‌బాల్ పోటీల్లో బిట్రగుంట సుధా మెమోరియల్ జట్టు విజయం సాధించింది. వారికి పీఎస్ఆర్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు పసుపులేటి సుధాకర్, సుగుణ దంపతులు లక్ష రూపాయల నగదు, ట్రోఫీ అందచేశారు. రన్నర్స్ త్రిపుర జట్టుకు 50వేల రూపాయల నగదు, ట్రోఫీని జాతీయ ఫుట్‌బాల్ క్రీడాకారుడు మహేంద్ర(మను) చేతుల మీదుగా అందచేశారు. బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో కావలి మాజీ మున్సిపల్ చైర్మన్ డాక్టర్ ప్రభాకర్ నాయుడు, ఉమెన్ ఫుట్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఉపాధ్యక్షుడు ఎస్ఏ నవీద్ పాల్గొన్నారు. రఫ్రీలుగా మోజెస్ చిట్టిబాబు, దీపు, బాచి, ఏటీమోహన్, కిరణ్, నైనిల్, స్టీఫెన్‌కుమార్, ఏ ఆంథోని వ్యవహరించారు.

కనుల పండువగా వేణుగోపాలస్వామి తెప్పోత్సవం

ఉలవపాడు, జనవరి 16: మండల కేంద్రం ఉలవపాడులోని వేణుగోపాలస్వామి ఆలయంలో శ్రీదేవి, భూదేవి సమేత స్వామివారికి మంగళవారం సాయంత్రం తెప్పోత్సవం కనులపండువగా నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారి తెప్పోత్సవం తిలకించారు. ఆలయ ధర్మకర్తలు సుధీష్ చంద్రారెడ్డి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత ఉదయం ఆలయం ప్రాంగణంలో స్వామివారి కల్యాణోత్సవం ఘనంగా జరిగింది. స్థానిక ఎస్సై బాజీరెడ్డి ఆధ్వర్యంలో పోలీసులను మోహరించి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన బందోబస్తు నిర్వహించారు.

తెప్పోత్సవంలో ఎస్టీ సర్పంచి కి అవమానం

ఉలవపాడు గ్రామంలో మంగళవారం జరిగిన శ్రీ వేణుగోపాల స్వామి తెప్పోత్సవంలో సర్పంచ్ మానికల నాగలక్ష్మీకి అవమానం జరిగింది. స్వామివారి కోనేరు వద్ద ఆలయ ధర్మకర్తలకు కుర్చీలు వేశారు. అక్కడికి వచ్చిన సర్పంచు కుర్చీలు ఖాళీగా కనిపించడంతో తనకు కేటాయించిన కుర్చీలనుకొని కూర్చుండిపోయింది. ఇంతలో ఆలయ సిబ్బంది ధర్మకర్తల కోసం వేసిన కుర్చీలని పైకి లేవాలని చెప్పడంతో చేసేది ఏమిలేక అక్కడే నిలబడిపోయింది. ఈ విషయాన్ని దేవస్థానం కార్యనిర్వాహక అధికారి ప్రసాదును అడగ్గా ధర్మకర్తలకు వేసిన కుర్చీలలో సర్పంచు కూర్చొని ఉందని, ఎలా జరిగిందో ఎవరు పైకిలేవమని చెప్పారో తెలియదని, విచారించి కనుక్కుంటానని చెప్పారు.

మృతుడి కుటుంబానికి కాకర్ల ట్రస్ట్ చేయూత

జలదంకి, జనవరి 16: జలదంకి మండలం కమ్మవారిపాలెంకు చెందిన నవులూరి వెంకటస్వామి ఇటీవల పాముకాటుకు గురై మృతిచెందాడు. విషయాన్ని టీడీపీ నేత, కాకర్ల ట్రస్ట్ చైర్మన్ సురేష్ దృష్టికి గ్రామ టీడీపీ నాయకులు తీసుకువెళ్లారు. దీంతో సురేష్ తన ట్రస్ట్ తరపున ఆర్థికసాయం కింద పంపిన నగదును గ్రామ ఉపసర్పంచ్ పరిమి ప్రతాప్, టీడీపీ నాయకులు కరియావుల అప్పలయ్యనాయుడు, పరిమి శ్రీహరిలు మృతుని కుటుంబ సభ్యులకు అందజేశారు.

ఎల్‌ఆర్ అగ్రహారంలో రక్తదాన శిబిరం



రక్తదానశిబిరం నిర్వహిస్తున్న నిర్వాహకులు

జలదంకి, జనవరి 16: మండలం లోని ఎల్.ఆర్ అగ్రహారం గ్రామంలో మనఊరు పిలుస్తోంది ట్రస్ట్ సభ్యులు సంక్రాంతి పండుగను పురస్కరించుకుని రక్తదాన శిబిరం సోమవారం నిర్వహించారు. కావలి రెడ్‌క్రాస్ బృం దం దాతల నుంచి రక్తాన్ని సేకరించింది. రక్తదానం చేసిన యువకులను ట్రస్ట్ సభ్యులు గాలి శ్రీనివాసులు, గొట్టిపపాటి మురళీ, సైనికోద్యోగి క్రిష్ణ అభినందించారు. అనంతరం గ్రామంలో ట్రస్ట్ తరపున మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు.

సీసీ రోడ్డుకు శంకుస్థాపన

జలదంకి మండలం కేశవరం ఎస్సీకాలనీలో సర్పంచ్ రావి ప్రసాద్‌నాయుడు సీసీ రోడ్డుకు మంగళవారం శంకుస్థాపన చేశారు. ఉదయగిరి వైసీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి ఇచ్చిన నిధులతో ఈ రోడ్డు నిర్మించడం జరుగుతోందని సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ గణాది రవిచంద్ర, మాజీ సర్పంచ్ లేటి సుధీర్, వార్డుసభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

పేదలకు దుస్తుల పంపిణీ

అల్లూరు, జనవరి 16 : సంక్రాంతి పండుగను పురస్కరించుకొని అల్లూరులోని కెఎస్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ అధినేత కందల రాజారెడ్డి, జోసెఫ్, కమల్ సింగ్, తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ వర్ధంతికి ఘనంగా ఏర్పాట్లు : ఇంటూరి

కందుకూరు, జనవరి 16: కందుకూరులో ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమాన్ని ఈనెల 18న ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. స్థానిక వెంగమాంబ ఫంక్షన్‌హాలులో మంగళవారం సాయంత్రం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో పార్టీ నాయకులతో ఆయన మాట్లాడుతూ 18వ తేదీఉదయం 10 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని ముందుగా ఏరియా హాస్పటల్ సెంటర్‌లో ఉన్న దివంగత ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం అక్కడి నుంచి ర్యాలీగా వెంగమాంబ ఫంక్షన్‌హాలుకు చేరుకుని వర్ధంతి సభ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో రక్తదానశిబిరం నిర్వహించడం జరుగుతుందని, అనంతరం అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. కాగా, ఈనెల 17న సాయంత్రం 4 గంటలకు వలేటివారిపాలెం మండలం పోకూరులో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ జరుగుతుందన్నారు. మాజీ ఎమ్మెల్యే దివి శివరాం, పార్టీ నాయకురాలు ఉన్నం నళినీదేవి మాట్లాడుతూ ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు దామా మల్లేశ్వరరావు, నార్ని రోశయ్య, జనిగర్ల నాగరాజు, రాచగర్ల సుబ్బారావు, ఎన్వీ సుబ్బారావు, చిలకపాటి మధు, చదలవాడ కొండయ్య, బెజవాడ ప్రసాదు, వడ్డెళ్ల రవిచంద్ర, జి మోషే, చిత్తారి మల్లిఖార్జున, షేక్ మున్నా తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ వర్ధంతిని జయప్రదం చేయండి

ఉదయగిరి రూరల్ : స్థానిక పంచాయతీ బస్టాండ్ సెంటర్‌లో గురువారం నిర్వహించే మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారకరామారావు వర్ధంతి వేడుకలను జయప్రదం చేయాలని మండల టీడీపీ కన్వీనర్ చింతనబోయిన బయ్యన్న మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ వేడుకలకు మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకటరామారావు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పొన్నెబోయిన చెంచలబాబుయాదవ్ పాల్గొంటారన్నారు.

కొనసాగుతున్న అంగన్‌వాడీల సమ్మె



నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు

ఆత్మకూరు, జనవరి 16 : తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు చేపట్టిన సమ్మె కొనసాగుతూనే ఉంది. మంగళవారం విధులను బహిష్కరించి ఆత్మకూరు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన శిబిరంలో బైఠాయించి సమ్మెను కొనసాగించారు. వీరికి మద్దతుగా సీపీఎం, సీఐటీయూ నాయకులు జీ లక్ష్మీపతి, జీ శివప్రసాద్, నాగేంద్ర శిబిరానికి విచ్చేసి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్ట్ కమిటీ ప్రధాన కార్యదర్శి పీ రాధ, పలువురు సెక్టార్ లీడర్లు కే రమణమ్మ, కామేశ్వరీ, జమీల, విజయలక్ష్మీ, రూతమ్మ, విజయలక్ష్మీ, శ్రీదేవి, ఏ మస్తానమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు పాల్గొన్నారు.

మహిళలకు చీరల పంపిణీ

కావలి టౌన్, జనవరి 16: పట్టణ 18వ వార్డులో శానం కృష్ణ, ప్రణీత దంపతుల ఆధ్వర్యంలో మంగళవారం ముస్లీంలకు కనుమ విందు అందించి వార్డు మహిళలందరికీ చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కృష్ణ కుమార్తె వేదసంహింత, సతీమణి ప్రణీత తదతరులు పాల్గొన్నారు.

ఎన్‌డీసీసీబీ మాజీ చైర్మన్ దాతృత్వం



పేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న మెట్టుకూరు కుటుంబ సభ్యులు

అనంతసాగరం, జనవరి 16: మండలంలోని లింగంగుంటలో ఎన్‌డీసీసీబీ మాజీ చైర్మన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి, కుటుంబ సభ్యులు గ్రామంలోని 530 కుటుంబాలకు సంక్రాంతి సందర్భంగా దుస్తులు పంపిణీ చేశారు. ఏటా దుస్తులు పంపిణీ చేయడంపై గ్రామస్థులు వారికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

వాహనాలు నడిపేటప్పుడు ఏకాగ్రత అవసరం



మాట్లాడుతున్న డాక్టర్ మాధవరెడ్డి తదితరులు

కావలి, జనవరి 16: వాహనాలు నడిపేటప్పుడు ఏకాగ్రత తప్పినా ప్రమాదం జరిగే అవకాశం ఉందని వ్యక్తిగత వికాసం శిక్షకులు, డాక్టర్ మాధవరెడ్డి తెలిపారు. కావలి ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ఆర్టీసీ రోడ్డు భద్రతా వారోత్సవాలను డీఎం శ్రీనివాసులతో కలిసి మంగళవారం ఆయన ప్రారంభించారు. ప్రమాదరహిత డ్రైవింగ్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో లోక్ అదాలత్ సభ్యుడు సాయిప్రసాద్, డిపో అసిస్టెంట్ ఇంజనీర్ ఖాజామొహిద్దీన్, సీనియర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, మార్కెటింగ్ ఎగ్జిక్యూటీవ్ రవిప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా చప్టాలు

● వాహనదారుల అవస్థలు



కుడుమలదిన్నెపాడుసమీపంలో చప్టా వద్ద కనిపించని దిమ్మెలు

కలిగిరి, జనవరి 16: మండలంలోని పలు గ్రామాల్లో బ్రిడ్జిలు దెబ్బతిని చప్టాలు ప్రమాద కరంగా ఉండటం వలన రాత్రివేళల్లో వాహనాలపై ప్రయాణించాలంటే వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కమ్మవారిపాలెం, వెలగపాడు, పాతనాపురం, కుడుమలదిన్నెపాడు, చిన అన్నలూరు దూబగుంట గ్రామాల వద్ద నిర్మించిన చప్టాలవద్ద మార్జిన్‌లను గుర్తించడానికి సిమెంటు దిమ్మెలు గాని, ఇనుప బద్దీలు గాని రక్షణగా లేకపోవడం, చప్టాల వద్ద వేసిన సిమెంటురోడ్డు దెబ్బతిని ఉండటంతో భయం భయంగా ప్రయాణం చేయాల్సి వస్తుందని ద్విచక్ర వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చప్టాల వద్ద రోడ్డు మరమ్మతులు నిర్వహించి, దిమ్మెలు నిర్మాణం చేసి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని అధికారులను వాహనదారులు కోరుతున్నారు.

మొగలిచెర్లలో పడకేసిన పారిశుధ్యం

● ఇబ్బందులు పడుతున్న ప్రజలు



మొగిలిచెర్లలో మాలకొండ వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డుపై నిలిచి ఉన్న మురుగు నీరు

లింగసముద్రం, జనవరి 16 : మండలంలోని మొగిలిచెర్లలో పారిశుధ్యం అధ్వా నంగా ఉండడంతో గ్రామస్థులు అవస్థలు పడుతున్నారు. గ్రామం నుంచి మాలకొండ, పామూరు వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డుపై మురుగు నీరు నిలిచి దుర్గంధం వెదజల్లుతోందని వాపోతున్నారు. గ్రామంలోని కెనరాబ్యాంకు పక్కనే ఉన్న ఈ రోడ్డు పైకి కొందరు తమ ఇళ్లలోని వ్యర్థపు నీటిని వదులుతున్నారని, ఈనీరు రోడ్డుపై నిలవడంతో పాటు ఆర్‌అండ్‌బీ రోడ్డుపై నుంచి బస్టాండ్ సెంటర్, స్థానిక పాఠశాల మీదుగా సమీపంలోని పొలాల్లోకి వెళుతున్నట్టు గ్రామస్థులు పేర్కొంటున్నారు. రోడ్డు కిరువైపులా ఉన్న వారు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే ఈ రోడ్డు దోమలకు నిలయంగా మారిందని వారు ఆందోళన చెందుతున్నారు. మాలకొండ, దత్తాత్రేయస్వామి దేవాలయాలకు వెళ్లే భక్తులు కూడా ఇబ్బందులు పడుతున్నారు. అలాగే ఈ మురుగు నీరు నిల్వ ఉన్న చోట మంచినీటి పైపులైన్ కూడా లీకౌతోందని, సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

కేజీ వీల్స్‌తో రోడ్లు ధ్వంసం

అనంతసాగరం, జనవరి 16: గుంతలు పడి అధ్వాన్నంగా ఉన్న ఆత్మకూరు - సోమశిల రోడ్డుపై కొందరు కేజీ వీల్స్‌తో రహదారిపై రాకపోకలు సాగిస్తున్నా పట్టించుకునే నాథుడే లేడని గ్రామస్థులు విమర్శిస్తున్నారు. ట్రాక్టర్‌కు కేజీ వీల్స్‌తో ప్రధాన రహదారులపై ప్రయాణం చేయరాదన్న నిబంధనలు ఉన్నా పాటించకుండా విచ్చలవిడిగా తిరుగుతుండడంతో సోమశిల రోడ్డుపై ప్రయాణం నరకప్రాయంగా మారుతోందని, ఇప్పటికైనా అధికారులు స్పందించి కేజీ వీల్స్‌తో ట్రాక్టర్లు రహదారిపై రాకపోకలు సాగించకుండా తగు చర్యలు తీసుకోవాలని వాహన చోదకులు వాపోతున్నారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న డాక్టర్ మాశిలామణి

వింజమూరు, జనవరి 16 : మండలంలోని అరుంధతీయవాడలో ఎంఎస్పీ సీనియర్ నాయకులు గోచిపాతల ఆనంద్‌మాదిగ ఆధ్వర్యంలో డాక్టర్ మాశిలామణి వృద్ధులు, వికలాంగులు, మహిళలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండుగ సందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆలోచన విధానాన్ని ప్రజలు ముందుకు నడపాలని అందుకు నావంతు కృషి చేస్తానని తెలిపారు. అదేవిధంగా జిల్లాలో మెట్ట ప్రాంతమైన ఉదయగిరి నియోజకవర్గంలో దాదాపు 35 సంవత్సరాల నుంచి పేద, ధనిక తారతమ్యం లేకుండా అన్ని వర్గాల ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నానన్నారు. ఈ సందర్భంగా అరుంధతివాడలో దుప్పట్ల పంపిణీ కార్యక్రమం చేపట్టామన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు మల్లెల తిరుమలేసుమాదిగ, గోచిపాతల సాంబశివరాలుమాదిగ, ఎంఎస్పీ నాయకులు గంగపట్ల వెంగళరావు పాల్గొన్నారు.

10 మంది పేకాటరాయుళ్ల అరెస్ట్

వలేటివారిపాలెం, జనవరి 16 : మండలంలోని శాఖవరం - కొండసముద్రం గ్రామాల సమీపంలోని పొలాలలో వలేటివారిపాలెం, లింగసముద్రం ఎస్‌ఐలు బాలమహేంద్రనాయక్, బాజీబాబులు తన సిబ్బందితో కలిసి సోమవారం మధ్యాహ్నం పేకాట శిబిరంపై దాడి చేశారు. 10 మంది పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. రూ. 1,90,670 నగదు స్వాధీనం చేసుకున్నారు. పేకాటరాయుళ్లపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచనున్నట్లు వలేటివారిపాలెం ఎస్‌ఐ బాలమహేంద్రనాయక్ తెలిపారు

కోడి పందెంరాయుళ్లు...

ఉలవపాడు, జనవరి 16: మండలంలోని చాగొల్లు గ్రామం శివారు ప్రాంతం మామిడి తోపుల్లో నిర్వహిస్తున్న కోడిపందెం శిబిరంపై మంగళవారం పోలీసులు దాడిచేసి ఏడుగురు పందెంరాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. నాలుగు కోళ్లను, రూ. 6400 స్వాధీనం పరుచుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై బాజీరెడ్డి తెలిపారు.

డీఆర్‌కు ఘన నివాళి




డీఆర్‌కు నివాళులు అర్పిస్తున్న రెడ్‌క్రాస్ బాధ్యులు

కావలి, జనవరి 16: విశ్వోదయ విద్యాసంస్థల వ్యవస్థాపకుడు దొడ్ల రామచంద్రారెడ్డి (డీఆర్) వర్ధంతి సందర్భంగా మంగళవారం రెడ్‌క్రాస్ రక్తనిధిలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ రవిప్రకాష్, గోపి కృష్ణ, గంరంధం ప్రసన్నాంజనేయులు పేరూరి కొండలరావు, హరినారాయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అన్నప్రసాద భవనానికి విరాళం

కందుకూరు, జనవరి 16: పట్టణంలోకి కనిగిరి రోడ్డులో ఉన్న అయ్యప్పస్వామి ఆలయం వద్ద నిర్మిస్తున్న అన్నప్రసాద భవనానికి శ్రీసంస్కృతి స్కూల్ యాజమాన్యం రూ. 2,00,016 విరాళం అందజేసింది. స్కూల్ డైరెక్టర్, విప్పగుంట గ్రామవాసి కొంకా లక్ష్మీనరసింహం, ఆయన కుమారుడైన స్కూల్ చైర్మన్ కొంకా చంద్రశేఖర్‌లు ఈమొత్తాన్ని కమిటీ సభ్యులకు మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు కేఎస్ వెంకటేశ్వర్లు, ఇస్కాల వెంకటనరసింహం, నల్లబోతుల మురళీ, మాదాల వెంకటేశ్వర్లు, కాటా చెంచురామయ్య, దాసరి శ్రీనివాసులు, ఉన్నం వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

వెంకన్న భక్తుల భిక్షాటన



భిక్షాటన చేస్తున్న వెంకటేశ్వరస్వామి భక్తులు

ఉదయగిరి రూరల్, జనవరి 16: మండలంలోని గండిపాళెం గ్రామంలో మంగళవారం వెంకటేశ్వరస్వామి భక్తులు భిక్షాటన కార్యక్రమం నిర్వహించారు. వెంకటేశ్వరస్వామి నామస్మరణ, సంకీర్తనలు చేసుకుంటూ గ్రామ పురవీధుల్లో గ్రామోత్సవం చేపట్టి భిక్షాటన నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు భక్తులు మాట్లాడుతూ ఈనెల 18న ప్రకాశం జిల్లా పామూరు నుంచి తిరుమలకు పాదయాత్ర చేపట్టి కలియుగ వెంకటేశ్వరస్వామిని దర్శించుకోవడం జరుగుతుందన్నారు. అందులో భాగంగా భిక్షాటన కార్యక్రమం చేపట్టామన్నారు.

పల్లెల్లో సంక్రాంతి సందడి



వెంకటాచలం, జనవరి 16 : మండలంలో సంక్రాంతి పండుగను అత్యంత వైభవంగా జరుపుకున్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా మండలంలోని దాదాపు అన్ని గ్రామాల్లోని ఆలయాలతో పాటు ప్రముఖ పుణ్యక్షేత్రలైన కసుమూరులోని మస్తాన్‌వలీ దర్గా, గొలగమూడిలోని భగవాన్ శ్రీ వెంకయ్య స్వామి ఆశ్రమాలు భక్తులతో కిక్కిరిశాయి. మంగళవారం కనుమ పండుగను రైతులు వైభవంగా జరుపుకున్నారు.

టీడీపీ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీ

మండలంలోని అనికేపల్లి పంచాయతీ రామాపురంలో సంక్రాంతి సందర్భంగా టీడీపీ మండలాధ్యక్షుడు గుమ్మడి రాజా యాదవ్ ఆధ్వర్యంలో మంగళవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. మహిళలు పోటాపోటీగా వేసిన ముగ్గులను మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి కోడలు సోమిరెడ్డి శృతిరెడ్డి పాల్గొని పరిశీలించారు. అనంతరం విశాలక్షి వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్థసారధి నాయుడు, చల్లా రవీంద్ర, సత్తార్ సాహెబ్, గొట్టం బ్రహ్మయ్య, రవినాయుడు, డీ అంకయ్య, ఈ శ్రీనివాసులు, దామోదర్, నంబూరు సుజీత్, క్రిష్ణయ్య, మస్తాన్, పవన్, మౌలాలి తదితరులు ఉన్నారు. అలాగే మండలంలోని తిక్కవరప్పాడు పంచాయతీ జోసఫ్‌పేట, ఇస్కుపాళెం గ్రామాల్లో వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించారు. జోసఫ్‌పేటలో మంగళవారం ఐటీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పాకం శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించగా విజేతలకు బహుమతులను అల్తూరు గిరిష్‌రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి అందజేశారు. ఇస్కుపాళెంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు జీకే టెస్ట్ నిర్వహించి విజేతలుగా నిలిచిన వారికి మెమెంటో, నగదు బహుమతులను అందజేసినట్లు బీజేపీ యువమోర్చా మండల అధ్యక్షుడు, నిర్వాహకుడు గోతల నరేష్ తెలిపారు.

తోటపల్లిగూడూరు: మండలంలోని కొత్తపాలెం, కొత్తకోడూరు, వెంకన్నపాలెం, పాపిరెడ్డిపాలెం, నరుకూరు, మాచర్లవారి పాలెం గ్రామాల్లో ముగ్గుల పోటీలు, కబడ్డీ పోటీలు జరిగాయి. గ్రామాల్లో యువకులు, పిల్లలు ఉత్సాహంగా పాల్గొన్నారు. కొత్తపాలెంలో అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో కబడ్డీ ముగ్గుల పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. మండలంలోని తోటపల్లి గూడూరు, ఇసుకపాలెం దళితవాడ గ్రామాల్లో సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి కోడలు సోమిరెడ్డి శృతి ముగ్గుల పోటీలను తిలకించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొమ్మి సురేంద్ర, టీడీపీ మండల అధ్యక్షులు సన్నారెడ్డి సురేష్‌రెడ్డి, బీసీ నాయకులు మన్నెం జిత్రేంద, ఇసుకపాలెం సర్పంచ్ ఇంగిలాల చైతన్య, నరుకూరు ఎంపీటీసీ కొణతం రఘుబాబు, వీరబోయిన గంగాధర్, మాజీ ఎంపీపీ ఇంగిలాల నిర్మలమ్మ, పాకం వెంకయ్య, ముత్యాల నాగేశ్వరరావు, తలమంచి గణేష్, తదితరులు పాల్గొన్నారు.



ముగ్గులను పరిశీలిస్తున్న సోమిరెడ్డి కోడలు శృతిరెడ్డి

ఘనంగా సంక్రాంతి, కనుమ వేడుకలు

విడవలూరు, జనవరి 16: మండలంలో సంక్రాంతి, కనుమ వేడుకలు ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. పండుగ సందర్భంగా ప్రతి లోగిలి బంధుమిత్రులతో కళకళలాడింది. దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. హిందు, ముస్లింలు కలసి విందు భోజనాలు చేశారు. కనుమ పండుగ సందర్భంగా పాడి పశువులకు రంగులు వేసి అందంగా ముస్తాబు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రామచంద్రాపురం, వరిణి, దండిగుంట, అన్నారెడ్డిపాళెం, విడవలూరులో సంక్రాంతిని పురస్కరించుకుని ఆటల పోటీలు నిర్వహించారు. అన్నారెడ్డిపాలెంలో స్పార్టెన్స్ ఏఆర్‌పీ ఆధ్వర్యంలో వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలిచిన వారికి కోవూరు మాజీ ఏఎంసీ ఛైర్మన్ రామిరెడ్డి విజయభానురెడ్డి, మాజీ ఎంపీటీసీ సింహాద్రి అయ్యప్ప బహుమతులు అందజేశారు.

ఉత్సాహంగా ఆటల పోటీలు

కోవూరు, జనవరి 16: సంక్రాంతి పర్వదినం సందర్భంగా మంగళవారం పట్టణంలో ఆటల పోటీలు నిర్వహించారు. డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో తాడులాగుడు, స్లోసైక్లింగ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. చెన్నకేశవస్వామి ఆలయం ఎదుట మహిళలకు రంగవల్లుల పోటీలు నిర్వహించారు. మహిళలు పెద్దసంఖ్యలో రంగవల్లుల పోటీల్లో పాల్గొన్నారు.

బుచ్చిలో ఆటలతో సందడి

బుచ్చిరెడ్డిపాళెం, జనవరి 16: బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీతోపాటు మండలంలోని అన్ని గ్రామాలలో ప్రజలు సంక్రాంతి వేడుకలను ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. సంక్రాంతిని పురస్కరించుకుని పలు గ్రామాల్లో టీడీపీ, వైసీపీ, డీవైఎఫ్ఐ, మహిళా సంఘాలు అధ్వర్యంలో జొన్నవాడ, పెనుబల్లి, రేబాల, దామరమడుగు, కాళయకాగొల్లు, మినగల్లు, తదితర గ్రామాలలో కబడ్డీ, క్రికెట్టు, వాలీబాల్, ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.



బుచ్చి : ముగ్గుల పోటీ విజేతకు బహుమతులిస్తున్న డీవైఎఫ్ఐ, మహిళా సంఘాల నాయకులు

వైభవంగా కామాక్షితాయి గ్రామోత్సవం

బుచ్చిరెడ్డిపాళెం, జనవరి 16: సంక్రాంతి వేడుకల్లో భాగంగా మంగళవారం కనుమ పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీ మల్లికార్జునస్వామి, కామాక్షితాయి గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. జొన్నవాడ ఆలయం నుంచి అమ్మవారు ఊరేగింపుగా భక్తులకు దర్శనమిస్తూ పెనుబల్లికి పారువేట ఉత్సవంతో వెళ్ళారు. అక్కడ గ్రామోత్సవం అనంతరం జొన్నవాడ ఆలయానికి చేరుకున్నారు. అలాగే వరదరాజస్వామి ఆలయంలో హనుమంతు సేవ నిర్వహించారు. రేబాలలో పుట్టాలమ్మకు పారువేట ఉత్సవం వైభవంగా జరిగింది, రాత్రి కొత్తూరు నుంచి పాతూరు వరకు గ్రామోత్సవం జరిగింది. ఈ ఉత్సవానికి స్థానిక ప్రజలతోపాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి కూడా ప్రజలు తరలివచ్చారు.

ఘనంగా గొబ్బెమ్మల ఊరేగింపు

మండలంలోని సాల్మానుపురం గ్రామంలో మంగళవారం గొబ్బెమ్మల ఊరేగింపు వేడుకలు వైభవంగా నిర్వహించారు. కనుమ సందర్భంగా మంగళవారం స్థానిక రామాలయం ముందు గొబ్బెమ్మను కొలువుదీర్చి భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. అనంతరం చిన్నారులు, మహిళలు మలిదేవి బ్రిడ్జి వరకు ఊరేగించి మలిదేవి కాలువలో నిమజ్జనం చేశారు. అనంతరం ప్రసాదాలు పంపిణీ చేశారు.



విడవలూరు : విజేతలకు బహుమతులు అందజేస్తున్న రామిరెడ్డి విజయభానురెడ్డి, తదితరులు

తోడేరులో మంత్రి కాకాణి సంబరాలు

● లబ్ధిదారులకు భూపట్టాల పంపిణీ



పట్టాలు పొందిన గ్రామస్థులతో మంత్రి గోవర్ధన్‌రెడ్డి

పొదలకూరు, జనవరి 16 : మండలంలోని తోడేరులో సంక్రాంతి సందడి నెలకొంది. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి స్వగ్రామమైన తోడేరులో ప్రతి ఏటా సంక్రాంతి పర్వదినాన కుటుంబ సభ్యులతో వచ్చి బంధువులతో, గ్రామస్తులతో సరదాగా గడపటం ఆనవాయితీ. తన తండ్రి స్వర్గీయ కాకాణి రమణారెడ్డి సమాధి వద్దకు చేరుకుని కాకాణి నివాళులర్పించారు. అలాగే గ్రామంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను అధికారులతో సమీక్షించారు. అంతేకాకుండా తోడేరు పంచాయతీ పరిధిలోని పలువురు రైతులకు భూపట్టాలను పంపిణీ చేశారు. ఈ వేడుకల్లో కాకాణి కుటుంబ సభ్యులు, మండల ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, మండల వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ట్రైసైకిళ్ల పంపిణీ

బుచ్చిరెడ్డిపాళెం, జనవరి 16: స్థానిక వైసీపీ కార్యాలయంలో మంగళవారం కోవూరు ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి పలువురు దివ్యాంగులకు ఎన్‌ఎస్‌ఆర్ ట్రస్టు తరపున ట్రైసైకిళ్లను పంపిణీ చేశారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన నాగమాంబాపురానికి చెందిన అల్లాడి విష్ణు కుటుంబానికి లక్ష రూపాయలు, బుచ్చి నగర పంచాయతీలో తల్లిదండ్రులను కోల్పోయిన యాదాల దీపిక, దివ్యకు రూ.50వేలు ఫిక్సిడ్ డిపాజిట్ చేయించి ఆ పత్రాలను వారి కుటుంబాలకు అందజేశారు.

నిత్యావసరాల పంపిణీ

బుచ్చిరెడ్డిపాళెం ఖాజానగర్‌కు చెందిన రహమత్ అనే వ్యక్తి ఇటీవల ఆత్మకూరు వద్ద రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలై జీవన భృతి కష్టతరమైంది. ఆ కుటుంబానికి స్థానిక టీడీపీ నాయకులు రఫీ, సర్దార్, షబ్బీర్ మంగళవారం ఒక నెలకు సరిపడే నిత్యావసర సరుకులు అందించారు.

నేత్రదానం

విడవలూరు, జనవరి 16: మండల పరిధిలోని చౌకిచర్ల గ్రామంలో తలువాది జయమ్మ (70) సోమవారం మృతి చెందారు. వారి కుటుంబ సభ్యుల కోరిక మేరకు మన సేవా సంస్థ నిర్వాహకులు దేవళ్ల శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో మృతిరాలి నేత్రాలను దానం చేశారు. నేత్రాలను మోడరన్ ఐ ఆసుపత్రి వైద్యులు వేణు సేకరించారు.

పొదలకూరులో మకరజ్యోతి దర్శనం

పొదలకూరు, జనవరి 16 : పట్టణంలోని అయ్యప్ప నగర్‌లోని శ్రీకళ్యాణ వెంకటేశ్వరస్వామి దేవస్థానం ఆవరణలో ఉన్న అయ్యప్ప సన్నిధిలో మకర సంక్రాంతి పండుగ సందర్భంగా సోమవారం మకరజ్యోతిని వెలిగించారు. శబరిమలలోని అయ్యప్ప మకరజ్యోతి లాగానే 20 ఏళ్లుగా ఈ కార్యక్రమాన్ని గురుస్వామి అల్లూరు రమణయ్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ముందుగా వినాయకుడు, సుబ్రహ్మణ్యం స్వామి, అయ్యప్పస్వామి వార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం అభిషేకాలు చేసి స్వామివారి జ్యోతిని వెలిగించి అయ్యప్ప భక్తులకు మకరజ్యోతి దర్శనం కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు బోయిళ్ల మాలకొండారెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.

శేషురెడ్డి మృతి పార్టీకి తీరని లోటు: సోమిరెడ్డి

● నివాళులర్పించిన వైసీపీ, టీడీపీ నాయకులు



నివాళులర్పిస్తున్న సోమిరెడ్డి, శేషురెడ్డి (ఫైల్)



మనుబోలు, జనవరి 16: టీడీపీ సీనియర్ నాయకుడు మన్నెమాల శేషురెడ్డి మృతి చెందడం పార్టీకి తీరని లోటని మాజీ మంత్రి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. మండలంలోని కొమ్మలపూడి మాజీ సర్పంచు మన్నెమాల శేషురెడ్డి (70) సోమవారం అర్ధరాత్రి మృతిచెందారు. ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. సోమిరెడ్డి మంగళవారం శేషురెడ్డి నివాసానికి చేరుకుని ఆయన పార్థివదేహానికి నివాళులర్పించారు. అనంతరం శేషురెడ్డి కుమారుడు భాస్కర్‌రెడ్డిని, కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆయనతోపాటు సర్వేపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, వైసీపీ నాయకులు గూడూరు మున్సిపల్ ఛైర్మన్ పొనకా దేవసేనమ్మ, ఆమె భర్త శివకుమార్‌రెడ్డి, కోడూరు మీరారెడ్డి, బిరదవోలు శ్రీకాంత్ రెడ్డి, గ్రామ సర్పంచ్ బందిల వేణుగోపాల్, ఎంపీటీసీ సభ్యురాలు గుండాల శిరీషా, టీడీపీ నాయకులు పొన్నూరు రామకృష్ణయ్య, గాలి రామకృష్ణారెడ్డి నివాళులర్పించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి మాట్లాడుతూ శేషురెడ్డి మరణం బాధాకరమని, ఆయన చాలాకాలం పార్టీకోసం పనిచేశారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మధునాయుడు, మస్తాన్‌నాయుడు, నాగేశ్వరరావు, పచ్చిపాల రామిరెడ్డి, కిరణ్‌కుమార్, వెంకటరమణయ్య, రామ్మోహన్ రెడ్డి, హనుమంతనాయుడు, యానాది నాయుడు, శ్రీధర్‌రెడ్డి, కృష్ణమనాయుడు, చిట్టిబాబు, రాజాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు సిటీ, రూరల్
కోవూరు, సర్వేపల్లి



పారువేట ఉత్సవానికి ముందు రంగనాథ స్వామికి పూజలు చేస్తున్న అర్చకులు

సంబరంగా సంక్రాంతి

- ఆలయాల్లో వేడుకలు
- పెద్దలకు భక్తిశ్రద్ధలతో పూజలు
- కనుల పండువగా కనుమ పారుపేట



రంగడి ఆలయంలో గోపూజ చేస్తున్న భక్తులు



నెల్లూరు (సాంస్కృతికం), జనవరి 16 : నగరంలో సంక్రాంతి సంబరాలు అంబరాన్ని అంటాయి. గుమ్మాల ముందు రంగవల్లులు, ఇంటికి మామిడి తోరణాలతో నగర వాసులు సంక్రాంతి లక్ష్మిని ఆహ్వానించారు. భక్తిశ్రద్ధలతో పూజలు చేసి ముత్తైదువులకు తాంబూలాలు, వాయినాలిచ్చి ఆశీస్సులు అందుకున్నారు. కొందరు బొమ్మల కొలువులు ఏర్పాటు చేసి గౌరీ దేవిని పూజించారు. పలు ప్రాంతాల్లో ముగ్గుల పోటీలు జరిగాయి. వాసవీ క్లబ్ నెల్లూరు సిటీ ఆధ్వర్యంలో నవాబుపేట పత్తివారి హైస్కూల్ సమీపంలో రంగవల్లుల పోటీ ఉత్సాహంగా జరిగింది. చలువాది నాగేశ్వరరావు, పాదర్తి బాలాజీ, పబ్బిశెట్టి నందకిషోర్ తదితరులు పర్యవేక్షించారు. సింహపురి సంక్రాంతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఇరుకళల పరమేశ్వరి ఆలయం వద్ద గల గణేష్ ఘాట్‌లో పతంగుల పోటీ నిర్వహించారు. అన్ని వయసుల వారు ఉత్సాహం గా పాల్గొన్నారు. విజేతలకు ఉత్సవ సమితి నాయకులు బహుమతులు అందజేశారు.

● **భక్తిశ్రద్ధలతో పెద్దల పండుగ**

సంక్రాంతి సందర్భంగా సోమవారం పెద్దల పండుగను నగరవాసులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. బోడిగాడితోటలోని పెద్దల సమాధులను ప్రత్యేకంగా అలంకరించి పూజల చేశారు. వారి స్మరణార్థం వస్త్ర, అన్నదానాలు జరిపారు.

● **ఆలయాలు కిటకిట..**

సంక్రాంతి పర్వదినం సందర్భంగా తల్పగిరి రంగనాథస్వామి ఆలయం, రాజరాజేశ్వరి అమ్మవారు, మూలస్థానేశ్వరస్వామి, వేణుగోపాలస్వామి, శ్రీకృష్ణధర్మరాజ స్వామి, గురువాయు రప్పన్, మహావిష్ణువు ఆలయాల్లో ఉత్సవాలు జరిగాయి. భక్తులు రద్దీతో కళకళలాడాయి. ఆలయాలను ప్రత్యేకంగా పూలతో అలంకరించారు. గోపూజతోపాటు ప్రత్యేక పూజలు జరిపారు. భక్తులకు అన్నప్రసాదాలు పంపిణీ చేశారు. సాయంత్రం తల్పగిరి రంగనాథ స్వామికి పేట ఉత్సవం కనుల పండువగా జరిగింది.

● **మహాలక్ష్మి ఆలయంలో భారీ అన్నదానం**

నగరంలోని సీఆర్‌పీ డొంక మహాలక్ష్మి ఆలయంలో కనుమ వేడుకలు వైభవంగా జరిగాయి. అమ్మవారికి విశేష అభిషేకాలు, హోమాలు, పూజలు చేశారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్తలు పీటీ జగన్నాథం, పద్మజ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

గ్రామాల్లో సందడి

నెల్లూరు(రూరల్): సంక్రాంతి వేడుకలను నెల్లూరు రూరల్ పరిధిలోని గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. పల్లెల్లోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. కనుమ పండుగ సందర్భంగా మంగళవారం పశువు లకు రంగులు వేసి అలంకరించారు. వేదగిరి లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో విశేష పూజలు, అశ్వవాహనంపై పారువేట ఉత్సవం కనుల పండువగా జరిగాయి.





బోడిగాడితోట సమాధుల వద్ద పెద్దలను స్మరించుకుంటూ పూజలు చేస్తున్న వారి కుటుంబ సభ్యులు

ఐకమత్యంతో పండుగలు జరుపుకోవాలి

● మాజీ మంత్రి పొంగూరు నారాయణ

నెల్లూరు (వైద్యం), జనవరి 16 : రైతుల ఇంట కాంతులు నింపే పండుగ కనుమ పండుగ అని మాజీ మంత్రి, టీడీపీ నేత పొంగూరు నారాయణ అన్నారు. మంగళవారం నగరంలోని బాలాజీనగర్ మసీదు సెంటర్ వద్ద జరిగిన ముగ్గుల పోటీ విజేతలకు బహుమతులు అందచేశారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ 18 ఏళ్లుగా టీడీపీ నేత షమీమ్ సంక్రాంతికి ముగ్గుల పోటీలు నిర్వహించటం అభినందనీయమన్నారు. అన్ని పండుగలను ఇలాగే ఐకమత్యంతో జరుపుకోవాలని కోరారు. టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ తాళ్లపాక అనూరాధ, మాజీ కార్పొరేటర్ ఆనం రంగమయూర్‌రెడ్డి, టీడీపీ మహిళా నేత షమీమ్, శ్రీనివాసులు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయ దుస్తుల్లో డాక్టర్ బిందుమీనన్



వేమిరెడ్డికి కావలి ఎమ్మెల్యే శుభాకాంక్షలు

నెల్లూరు(హరనాథపురం), జనవరి 16 : కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిసి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వేమిరెడ్డిని శాలువాతో సత్కరించారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న నారాయణ, కోటంరెడ్డి



మహాలక్ష్మి ఆలయంలో అన్నదానం చేస్తున్న పీటీ జగన్నాథం దంపతులు



వాసవీ క్లబ్ సిటీ నిర్వహించిన ముగ్గుల పోటీల విజేతలకు బహుమతి ప్రదానం

ఘనంగా వస్త్ర, అన్నదానం

నెల్లూరు(సాంస్కృతికం), జనవరి 16 : నగరంలోని చిన్నబజారులో గల న్యూరాజ్యలక్ష్మి హాల్, శుభమస్తు షాపింగ్ మాల్ వ్యవస్థాపకుడు బయ్యా వెంకట రమణయ్య వర్ధంతి సందర్భంగా నగరంలో అన్న, వస్త్రదానం చేశారు. ముఖ్య అతిథిగా సిటీ ఎమ్మెల్యే డాక్టర్ పీ అనిల్‌కుమార్ యాదవ్ పాల్గొన్నారు. తల్లిదండ్రుల పేరిట సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న బయ్యా సోదరులను అభినందించారు. ఈ కార్యక్రమంలో బయ్యా శ్రీనివాసులు, రవికుమార్ వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



అన్నదాన కార్యక్రమంలో ఎమ్మెల్యే అనిల్, బయ్యా సోదరులు

కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డికి సత్కారం

నెల్లూరు (వెంకటేశ్వరపురం), జనవరి 16 : నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిని రాజమహేంద్రవరం టీడీపీ నాయకులు సత్కరించారు. మంగళవారం జిల్లాకు వచ్చిన రాజమహేంద్రవరం నాయకులు గోలి రామకృష్ణ, రాము, సతీష్, విజయ కుమార్ నగరంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో కోటంరెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. శాలువాతో సత్కరించి ఎద్దుల బండిని నమూనాను బహూకరించారు.



కోటంరెడ్డిని సత్కరిస్తున్న టీడీపీ నాయకులు

క్రోనో కార్పస్ మొక్కలు తొలగించాలి

● వైద్య కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌కు వినతి

నెల్లూరు (వైద్యం), జనవరి 16 : ప్రభుత్వ వైద్య కళాశాల, జనరల్ ఆసుపత్రి పరిసరాల్లో అనారోగ్య కారకాలైన క్రోనో కార్పస్ మొక్కలను వెంటనే తొలగించాలని సింహపురి చైతన్య వేదిక డిమాండ్ చేసింది. ఈ మేరకు మంగళవారం ప్రభుత్వ వైద్య కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ మస్తాన్‌బాషాకు నిర్వాహకుడు బాబీ భగత్ వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆ మొక్క పుప్పొడి గాలి ద్వారా మనుషులపై పడితే చర్మ, శ్వాసకోశ వ్యాధులు సోకే ప్రమాదం ఉందని చెప్పారు. దీనికి ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సానుకూలంగా స్పందించారని బాబీ తెలిపారు.

ఘనంగా ముక్కాల పుట్టినరోజు

నెల్లూరు(సాంస్కృతికం), జనవరి 16 : నుడా చైర్మన్ ముక్కాల ద్వారకానాథ్ జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆయనకు పలు ఆర్య వైశ్య సంఘాల నాయకులు, సభ్యులు, నుడా అధికారులు జన్మదిన శుభాకాంక్షలు, అభినందనలు తెలిపారు.

షర్మిల నియామకంపై హర్షం


● కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు చేవూరు

నెల్లూరు (వైద్యం), జనవరి 16 : కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలిగా షర్మిల నియామకంపై ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు చేవూరు దేవకుమార్‌రెడ్డి ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. షర్మిల నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో ప్రగతి బాటలో నడుస్తుందని ఆశిస్తున్నామన్నారు.

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలుచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పత్రిక పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ కింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

నెల్లూరు ఏసీఎం	9985411424
నెల్లూరు ఏసీవో	9542727676
నెల్లూరు సిటీ	8179815202
నెల్లూరు రూరల్	8885688410
కోవూరు	8008894200



జల్లికట్టు సంబరం

• ఎ.రంగంపేటలో కోడెద్దుల జోరు • జనసంద్రమైన మూడు గ్రామాలు





చంద్రగిరి, జనవరి 16 : సంక్రాంతి సంబరాల్లో భాగంగా మంగళవారం చంద్రగిరి మండలంలోని ఎ.రంగంపేట, పుల్లయ్యగారిపల్లె, అరిగిలవారిపల్లెల్లో జల్లికట్టు వేడుకలను అట్టహాసంగా నిర్వహించారు.కోడెద్దుల జోరును తిలకించడానికి చుట్టుపక్కల ప్రాంతాలనుంచి జనం తరలిరావడంతో గ్రామాలు జనసంద్రమయ్యాయి.ఉదయం పశువుల యజమానులు గ్రామ దేవతకు పూజలు చేసి కోడెగిత్తలకు, ఆవులకు, దూడలకు కొమ్ములు చెలిగి రంగులు వేశారు. వాటికి కొప్పులు తొడిగి రంగు కాగితాలు అంటించిన చెక్క పలకలను, నగదును, రాజకీయ నాయకులు, సినీనటుల ఫొటోలతో కూడిన చెక్క పలకలను కొమ్ములకు కట్టి అల్లిలోకి వదిలారు. మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో ఎ.రంగంపేటలోని యాదవ వీధిలో పశువులను గుంపులు, గుంపులుగా వదిలారు. యువకులు గుంపులుగా అల్లె అవతల నిలబడి జోరుగా వచ్చే కోడెగిత్తలను నిలువరించేందుకు పోటీ పడ్డారు. కోడెగిత్తల కొమ్ములకు రంగు కాగితాలు అంటించిన చెక్కపలకలను సొంతం చేసుకొనేందుకు తీవ్రంగా ప్రయత్నించారు.ఈ క్రమంలో యువకుల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది.కొంతమంది యువకులకు గాయాలయ్యాయి.ఎ.రంగంపేటలో అధికంగా పశువులకు టీడీపీ నాయకుల ఫొటోలు, జెండాలు కట్టి వదిలారు.పుల్లయ్యగారిపల్లె, అరిగిలవారిపల్లెల్లో కూడా పశువుల పండుగను ఘనంగా నిర్వహించారు.ఎ.రంగంపేటలో జల్లికట్టుకు వేలాదిమంది జనం తరలిరావడంతో నారావారిపల్లె మీదుగా వెళ్ళే రోడ్డు మార్గం పూర్తిగా స్తంభించిపోయింది. జల్లికట్టు పూర్తయ్యాక ప్రజలు ఒక్కసారిగా జనం బయటకు రావడంతో ఎ.రంగంపేట సర్కిల్లో సుమారు అర్ధగంట పాటు ట్రాఫిక్ స్తంభించింది. పోలీసులు రంగంలోకి దిగి వాహన రాకపోకలను కొనసాగేలా చర్యలు తీసుకున్నారు.తిరుపతి రూరల్ మండలం, పుదిపట్ల సర్పంచ్ బడి సుధా యాదవ్ ఆధ్వర్యంలో వాటర్ బాటిళ్లను పంపిణీ చేయగా పలువురు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.చంద్రగిరి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి పులివర్తి నాని తనయుడు వినీల్, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఎ.రంగంపేట జల్లికట్టు వేడుకల్లో పాల్గొన్నారు.



వైభవంగా కైలాసగిరి ప్రదక్షిణ

• వివాహ వేడుకకు దేవగణాలను ఆహ్వానించిన పార్వతీ పరమేశ్వరులు



గిరి ప్రదక్షిణలో ఊరేగుతున్న స్వామి అమ్మవారు

శ్రీకాళహస్తి జనవరి 16: శ్రీకాళహస్తిలో కైలాసగిరి ప్రదక్షిణ సంబరం అంబరాన్ని తాకింది. తమ కళ్యాణ మహోత్సవానికి దేవగణాలను శివపార్వతులు ఆహ్వానించే వేడుకకు భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. మహాశివరాత్రి ఉత్సవాల్లో శివపార్వతుల కల్యాణ వేడుక వైభవంగా జరుగుతుంది.ఈ వేడుకకు రావాలంటూ పరమశివుడు సతీసమేతుడై కనుమ పండుగ రోజున దేవగణాలకు ఆహ్వానం పలుకుతారు.ఇందులో భాగంగా మంగళవారం స్వామి అమ్మవార్లు గిరిప్రదక్షిణగా వెళ్లి దేవగణాలకు ఆహ్వానం అందజేశారు.సోమవారం త్రిశూలం,పల్లకి గిరి ప్రదక్షిణ జరిగింది.మంగళవారం అర్చకులు అలంకార మండపంలో స్వామి అమ్మవార్లను విశేషంగా అలంకరించారు.భక్తుల శివనామ స్మరణ మధ్య స్వామి అమ్మవార్ల గిరిప్రదక్షిణ ఉదయం 7.30గంటలకు ఆలయం నుంచి మొదలైంది.వివిధ వాయిద్యాలు,కోలాట నృత్యాల నడుమ పార్వతీ పరమేశ్వరులతో పాటు వేలాది మంది భక్తులు వెంట నడిచారు.విడిది మండపాల వద్ద స్వామి అమ్మవార్లను కొలువుదీర్చగా స్థానిక ఉభయ దారులు నైవేద్యాలు సమర్పించారు.దాతలు పెద్దసంఖ్యలో మంచినీళ్లు,మజ్జిగ, శీతల పానీయాలు, అన్నప్రసాదాలు అందించారు. కైలాసగిరి రిజర్వాయర్ ఎదురుగా అంజూరు వారి మండపం వద్ద ముక్కంటి ఆలయం తరపున భక్తులకు అన్నదానం చేశారు. ఛైర్మన్ శ్రీనివాసులు, ఈవో రామారావు భక్తులకు అన్నప్రసాదాలు వడ్డించారు. గిరి ప్రదక్షిణకు హాజరు కానివారు పట్టణ శివారులోని శుకబ్రహ్మాశ్రమం వద్దకు సాయంత్రం వేలాదిగా తరలివచ్చారు. స్వామి అమ్మవార్లు తిరిగి వచ్చేలోపు స్వర్ణముఖి నదిలో పిల్లలు పెద్దలు ఆటపాటలతో కేరింతలు కొట్టారు.కోనేటి మిట్ట ప్రాంతంలోని ఎదురు సేవ మండపం వద్దకు స్వామి అమ్మవార్లు రాగా ప్రత్యేక పూజలు చేసి నైవేద్య హారతులను సమర్పించారు. ఈ ఎదురు సేవలో ఎంపీ గురుమూర్తి , ఎమ్మెల్యే మధుసూదన రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.ఇక్కడి నుంచి ముక్కంటి ఆలయం వరకూ స్వామి అమ్మవార్లు ఊరేగి గిరి ప్రదక్షిణకు స్వస్తి పలికారు.రాత్రి స్వామి అమ్మవార్లు అశ్వసింహ వాహనంపై పురవీధుల్లో ఊరేగి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.

కన్నులపండువగా పార్వేట ఉత్సవం

తిరుమల, జనవరి16(ఆంధ్రజ్యోతి): తిరుమలలో పార్వేటఉత్సవం కన్నులపండువగా జరిగింది.మంగళవారం మధ్యాహ్నం ఒంటిగంటకు మలయప్పస్వామి తిరుచ్చిలో పార్వేటమండపానికి వేంచేశారు. స్వామి వెంట మరో తిరుచ్చిపై శ్రీకృష్ణస్వామి కొలువుదీరారు.ఉభయదారులకు, తాళ్లపాక వంశీయులకు, మఠంవారికి మర్యాదలు చేశాక శ్రీకృష్ణస్వామిని సన్నిధి యాదవ పూజ చేసిన ప్రదేశానికి వేంచేపు చేసి పాలు, వెన్న, హారతులు సమర్పించారు.మలయప్పస్వామి సహా అర్చకులు ముందుకు కొంతదూరం పరుగెత్తి బడిసెను విసిరి వెనక్కు వచ్చారు. ఇలా మూడుసార్లు జరిగింది. మలయప్పస్వామి తిరిగి ఆలయ మహద్వారం వద్దకు చేరుకుని హథీరాంజీ మఠం వారి బెత్తాన్ని తీసుకుని సన్నిధిలోకి వేంచేశారు.టీటీడీ ఛైర్మన్ కరుణాకర రెడ్డి, జేఈవో వీరబ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.



నారావారిపల్లెలో సంక్రాంతి వేడుకలు



తల్లిదండ్రుల సమాధుల వద్ద చంద్రబాబు పూజలు



కొబ్బరికాయ కొడుతున్న లోకేశ్

చంద్రగిరి, జనవరి 16: టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు తన స్వగ్రామమైన నారావారిపల్లెలో సంక్రాంతి సంబరాలను ఘనంగా జరుపుకున్నారు.కుటుంబ సభ్యులతో,బంధువులతో కలిసి రెండు రోజులపాటు నారావారిపల్లెలో వున్న ఆయన సోమవారం ఉదయం 10.30 గంటలకు తెలుగు సంప్రదాయం ఉట్టి పడేలా పంచెకట్టు ధరించి సోదరి హైమావతి, సతీమణి భువనేశ్వరి, కుమారుడు లోకేశ్, మనవడు దేవాన్ష్, బావమరిది నందమూరి రామకృష్ణ, వదిన లోకేశ్వరి, మరదలు నారా ఇందిర, ఆమె కుమారుడు సినీహీరో నారా రోహిత్, నందమూరి బాలకృష్ణ భార్య వసుంధర, చిన్న



నాగాలమ్మకు భువనేశ్వరి,ఇందిర పూజలు



కుమార్తె తేజస్విని, ఆమె భర్త భరత్, కుమారుడు ఆర్యవీర్, కంఠమనేని శ్రీనివాస్, శ్రీమాన్ తదితరులతో కలిసి ఇంటి సమీపంలో వున్న గ్రామ దేవత దొడ్డి గంగమ్మ వద్దకు చేరుకుని పూజలు నిర్వహించారు. అనంతరం పొలాల వద్దవున్న కులదేవత నాగాలమ్మకు సంప్రదాయబద్ధంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. 11.30 గంటలకు చంద్రబాబు తన తల్లిదండ్రుల సమాధుల వద్దకు చేరుకుని నారా ఖర్జూర నాయుడు, అమ్మణ్ణమ్మలకు నివాళులర్పించారు.ఎన్టీఆర్ విగ్రహం వద్దకు చేరుకుని, పూలమాలలు వేసి నివాళులర్పించారు.చూడ్డానికి వచ్చిన టీడీపీ నాయకులు, కార్యకర్తల సమస్యలు వింటూ వారితో ఫొటోలు దిగారు.మాజీ మంత్రి అమరనాథరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు సుగుణమ్మ, దొమ్మలపాటి రమేష్, షాజహాన్‌బాషా, టీడీపీ నేతలు గాలి భానుప్రకాష్, కొల్లూరి ఇందుశేఖర్, థామస్, నరసింహ యాదవ్, శ్రీనాథ రెడ్డి, అనీషారెడ్డి, జెడ్డా రాజశేఖర్, తెలుగుయువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవినాయుడు,రామ్‌దాస్‌చౌదరి తదితరులు చంద్రబాబుతో,లోకేశ్‌తో మాట్లాడారు.

ఆకట్టుకున్న ఎన్టీఆర్ వేషధారణ

బాపట్ల జిల్లా పరుచూరు నియోజకవర్గ టీడీపీ నేత నాగేశ్వరరావు అలియాస్ అచారి ఎన్టీఆర్ వేషధారణలో నారావారిపల్లెలో సందడి చేశారు.దానవీరశూరకర్ణ సినిమా డైలాగులు చెప్పి అందర్నీ ఆకట్టుకున్నారు.సోమవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో నారావారిపల్లె నుంచి చంద్రబాబు తిరుగుప్రయాణమయ్యారు. రోడ్డు మార్గంలో విమానాశ్రయానికి వెళ్తూ చంద్రగిరి పార్టీ ఇన్‌చార్జి టీడీపీ అధ్యక్షుడు పులివర్తి నాని ఇంటికి వెళ్ళారు.దొంగ ఓట్లను తొలగించకపోవడంపై నిరసనగా చేపట్టిన నిరాహారదీక్షను పోలీసులు భగ్నం చేస్తే మనస్తాపం చెంది పెట్రోల్ పోసుకుని అస్వస్థతకు గురై చికిత్స పొందుతున్న నానీని పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. అక్కడి నుంచి రేణిగుంట సమీపంలోని విమానాశ్రయానికి చేరుకుని హైదరాబాదుకు వెళ్ళారు. సోమవారం మధ్యాహ్నం 3.45 గంటలకు టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఎ.రంగంపేట వద్ద ఏర్పాటు చేసిన హెలిపాడ్‌కు చేరుకుని హెలికాప్టర్‌లో విజయవాడకు వెళ్ళారు.

నాని ధర్మపోరాటాన్ని అందరూ గుర్తుపెట్టుకోవాలి



నానీని పరామర్శిస్తున్న చంద్రబాబు

చంద్రగిరి నియోజకవర్గంలో దొంగ ఓట్లపై పులివర్తి నాని ఆరు నెలలుగా ధర్మపోరాటం చేస్తున్నారు. ప్రజలు కూడా ఆయన పోరాటాన్ని గుర్తుపెట్టుకోవాలని చంద్రబాబు అన్నారు.నానీని ఆయన నివాసంలో పరామర్శించాక మీడియాతో మాట్లాడుతూ 'చంద్రగిరి నియోజకవర్గంలో 6 మండలాలున్నాయి. పక్కనే తిరుపతి, శ్రీకాళహస్తి, జీడీనెల్లూరు, పుంగనూరు, పూతలపట్టు, పీలేరు నియోజకవర్గాల్లో ఇక్కడి ఓటర్లను అక్కడికి, అక్కడి ఓటర్లను ఇక్కడికి మార్చేశారు. వైసీపీ వాళ్ల చేసే మోడ్ ఆఫ్ ఆపరేషన్ అంతుచిక్కని విధంగా ఉంది. ఫామ్ 6, 7, 8లను విచ్చలవిడిగా వినియోగించారు. 2019లో 290000 ఓట్లకు 325 బూత్‌లు ఉంటే, ఇప్పుడు 308000 ఓట్లకు 395 బూత్‌లకు పెంచేశారు.ఎమ్మెల్యే స్వగ్రామం తుమ్మలగుంటలో 4 బూత్‌లను 7 చేశారు. 37వేల ఓట్లు మార్పులు, చేర్పులు వచ్చాయి. ఫామ్ 6 ద్వారా 25వేల కొత్త ఓట్లు చేర్చారు. అందులో 40 నుంచి 80 ఏళ్ల వయస్సు గల 6వేల మంది కొత్త ఓటర్లు వచ్చారు. వారు ఎక్కడనుంచి వచ్చారో తెలియదు.ఒకే ఫొటో (పీఎస్‌ఈ)కలిగినవి 13800 ఓట్లున్నాయి. సంగీత హరి పేరుతో తిరుపతిలో ఒకటి, హరి సంగీత పేరుతో చంద్రగిరిలో మరొక ఓటును చేర్చారు. దువ్వాల క్రాంతి, మల్లంగుంట మహేష్, నందిని బసుమూర్తి, మల్లగుంట్ల బలరాముడు, సతీష్‌కుమార్ అల్లంపాటి, మరిశెట్టి గురవయ్య వంటి పేర్లను శ్రీకాళహస్తి, చంద్రగిరి, తిరుపతి, సత్యవేడు నియోజకవర్గాల్లో ఇంటిపేరును అటూ, ఇటూ మార్చి, ఫోటోలు బ్లర్ చేసి చేర్చారు. దీన్నిబట్టి అధికారులు వైసీపీతో ఏస్థాయిలో కుమ్మక్కయారో తెలుస్తోంది. బూత్‌లు మార్చారు. నియోజకవర్గాలు మార్చారు. వారి ఇష్టానుసారం చేసిపెట్టారు. పేరును నెంబర్లు మార్చేసి మూడు బూత్‌లలో వేశారు. కరుడుకట్టిన నేరస్థులు, ఉగ్రవాదుల కన్నా దారుణంగా ప్రవర్తిస్తున్నారు. అందుకే ఓటరు అవకతవకలపైన చంద్రగిరిని కేస్ స్టడీగా ఎన్నికల సంఘాన్ని తీసుకోమన్నాం' అని చెప్పారు. మాజీ మంత్రులు అమరనాథ రెడ్డి, పరసా రత్నం, టీడీపీ నేతలు నరసింహ యాదవ్, గాలి భానుప్రకాష్ తదితరులు ఆయన వెంట వున్నారు.

ఘనంగా మకరజ్యోతి వేడుకలు



నాగేశ్వరస్వామి ఆయలంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

సూళ్లూరుపేట, జనవరి 16: పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయం, పాండురంగ స్వామి ఆలయం, నాగేశ్వరస్వామి ఆలయాల్లో సోమవారం అయ్యప్ప స్వామి మకరజ్యోతి వేడుకలు వైభవంగా నిర్వహించారు. శబరి మలైలో మకరజ్యోతి వెలిగే సమయంలో అయ్యప్ప స్వామి భక్తబృందం ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో ఆలయం ఎదుట కర్పూరంతో జ్యోతిని వెలిగించారు. అశేష భక్తజనం.. అయ్యప్ప భక్తబృందం భజనల నడుమ భక్తులు కర్పూర జ్యోతి చుట్టూ ప్రదర్శనలు చేస్తూ జ్యోతిని తిలకించారు. ఈ సందర్భంగా ఆలయమంతా జ్యోతులు వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. నాగేశ్వరస్వామి ఆలయంలో లక్ష దీపాలు వెలిగించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ చెన్నారెడ్డి సుబ్రహ్మణ్యం రెడ్డి, అయ్యప్ప భక్తబృందం నాయకులు చిట్టిటి పెరుమాల్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు సభను విజయవంతం చేయండి



సభలో మాట్లాడుతున్న గంగాప్రసాద్

నాయుడుపేట, జనవరి 16: టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ఈనెల 19న వెంకటగిరిలో నిర్వహిస్తున్న రా.. కదిలిరా.. సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ సీనియర్ నాయకుడు, ప్రముఖ పారిశ్రామికవేత్త కొండేపాటి గంగాప్రసాద్ అన్నారు. నాయుడుపేట శ్రీనివాస్ ఫంక్షన్ హాలులో మంగళవారం సూళ్లూరుపేట నియోజకవర్గ స్థాయి సమావేశం నియోజకవర్గ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో నిర్వహించారు. మాజీ మంత్రి పరసా రత్నం, నియోజకవర్గ పరిశీలికుడు, మాజీ ఎమ్మెల్యే కంభంపాటి విజయరామిరెడ్డి, తిరుపతి, నెల్లూరు జిల్లాల తెలుగు మహిళ అధ్యక్షులు ఉష, పనబాక భూలక్ష్మి, ఏఎంసీ మాజీ శిరసనంబేటి విజయభాస్కర్ రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్ రెడ్డి, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి ఉయ్యాల ప్రవీణ్‌కుమార్, చెంచల బాబుయాదవ్, టీడీపీ నాయకులు శివకోటం రెడ్డి, డాక్టర్ సందీప్, శ్రీపతి బాబు, ఆకుతోట రమేష్, శ్రీనివాసుల నాయుడు, విజయకుమార్ నాయుడు, సంచి కృష్ణయ్య, పసల గంగాప్రసాద్, సుబ్బారావు, శ్రీరాం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గూడూరు: వెంకటగిరిలో ఈనెల 19వ తేదీన చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో జరగనున్న రా.. కదలిరా.. బహిరంగ సభను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 19న వెంకటగిరిలో జరగనున్న బహిరంగసభకు నియోజకవర్గం నుంచి నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో తరలిరావాలన్నారు. కార్యక్రమంలో నెలబల్లి భాస్కర్‌రెడ్డి, పులిమి శ్రీనివాసులు, వెంకటేశ్వర్లురాజు, బిల్లు చెంచురామయ్య, వెంకటేశ్వర్లురెడ్డి, అబ్దుల్ రహీం, మట్టం శ్రావణి, రాఘవరెడ్డి, నరసింహులు, అమరేంద్ర, ఇశ్రాయిల్‌కుమార్, పెంచలయ్య, కోటేశ్వరరావు, సురేంద్ర, ప్రణీత్, వెంకటసాయి, సునీల్, సందీప్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

సభ ఏర్పాట్ల పరిశీలన

వెంకటగిరి, జనవరి 16: టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు ఈ నెల 19వ తేది వెంకటగిరి పట్టణంలో నిర్వహించనున్న రా.. కదలిరా.. బహిరంగ సభ ఏర్పాట్లను ఆ పార్టీ నేతలు పరిశీలించారు. వెంకటగిరి - తిరుపతి రోడ్డు మార్గంలో సభ నిర్వహణకు నిర్ణయించిన ప్రాంతంలో మంగళవారం మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ దగ్గరుండి ఏర్పాట్లను పర్యవేక్షించారు. స్థానిక నాయకులతో జనసమీకరణపై చర్చించారు. కార్యక్రమంలో నాయకులు గంగోటి నాగేశ్వరావు, పులికొల్లు రాజేశ్వరావు, కేవీకే ప్రసాద్ నాయుడు, శ్రీరామదాసు గంగాధర్, పప్పు చంద్రమౌళిరెడ్డి, గల్లా శ్రీనివాసులు, వలస రాగవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేదురుమల్లితో అసమ్మతి నేతల సమావేశం



రాంకుమార్ రెడ్డితో సమావేశమైన నాయకులు

నాయుడుపేట, జనవరి 16: నాయుడుపేట మండలం మేనకూరులో వైసీపీ రాష్ట్ర కార్యదర్శి జిల్లా అధికారి ప్రతినిధి కట్టా సుధాకర్ రెడ్డి నివాసానికి ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి మంగళవారం వెళ్లారు. ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య వ్యతిరేకిస్తున్న నాయకులు రాంకుమార్‌రెడ్డితో సమావేశమయ్యారు. నియోజకవర్గంలో రాజకీయ పరిణామాలు, పార్టీలో అసమ్మతి తదితర అంశాలపై చర్చించినట్లు తెలిసింది. కార్యక్రమంలో రైతు విభాగ రాష్ట్ర కార్యదర్శి రామ్మోహన్ రెడ్డి, మున్సిపల్ వైస్ ఛైర్మన్ రఫీ, సూళ్లూరుపేట మున్సిపల్ ఛైర్మన్ దబ్బల శ్రీమంత్ రెడ్డి, రాకేష్ రెడ్డి, మల్లికార్జున్ రెడ్డి, రమణా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో ఆరోగ్యం

గూడూరు, జనవరి 16: క్రీడల ద్వారా ఆరోగ్యం చేకూరుతుందని రెండోపట్టణ సీఐ వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం స్థానిక ఏఏరెడ్డి ప్రభుత్వ స్టేడియంలో బెస్ట్‌ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరంతరం పని ఒత్తిడిలో ఉంటున్న ఉద్యోగులను, మీడియా ప్రతినిధులను ఓ వేదికపైకి చేర్చి క్రికెట్ పోటీలను నిర్వహించడం అభినందనీయమన్నారు. రెవెన్యూ, మున్సిపల్ ఉద్యోగులు, ప్రింట్, ఎలక్ట్రానిక్ ప్రతినిధులు పోటీల్లో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో రూరల్ ఎస్ఐ మనోజ్‌కుమార్, న్యాయవాది వసంత్‌కుమార్, వేగూరు రాజేంద్రప్రసాద్, విద్యుత్‌శాక ఏఈ మల్లికార్జున్‌రావు, సురేష్, రసూల్ తదితరులు పాల్గొన్నారు.

వెంకటగిరి అభివృద్ధికి కృషి

డక్కిలి, జనవరి 16: వెంకటగిరి నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని వైసీపీ జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మండలంలోని కమ్మపల్లి, తోపుగానిపల్లి, మిట్టపడ్డిపల్లి గ్రామాల్లో పర్యటించి గ్రామస్తులను సమస్యలు అడిగి తెలుసుకోన్నారు. తనకు ఒక్కసారి అవకాశం అభివృద్ధి చేసి చూపిస్తానన్నారు. కార్యక్రమంలో దేవునివెల్లంపల్లి స్తంభాలగిరి ఈశ్వరయ్య స్వామి ఆలయ ఛైర్మన్ నర్రావుల ప్రకాశం నాయుడు, వెంబులూరు ఎంపీటీసీ నర్రావుల మల్లేశ్వరమ్మ, వైసీపీ నాయకులు చింతల శ్రీనివాసులు రెడ్డి, వేణుగోపాల్ నాయుడు, వేపమాను యువరాజ్, ఆదిరెడ్డి మల్లికార్జనరెడ్డి, రామారావు, కృష్ణ, కోళ్లపూడి వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

అయోధ్య అక్షింతల పంపిణీ

గూడూరు, జనవరి 16: పట్టణంలోని నరసింగరావుపేట, మధురెడ్డికాలనీ, అరుంధతీయపాళెం తదితర ప్రాంతాల్లో మంగళవారం అయోధ్య అక్షింతలను ఇంటింటికీ తిరిగి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బీజేపీ పట్టణ అధ్యక్షుడు అరికట్ల బాలకృష్ణంనాయుడు మాట్లాడుతూ ఈనెల 22వ తేదీన అయోధ్యలో శ్రీరాముని విగ్రహానికి ప్రాణప్రతిష్ట నిర్వహించడం జరుగుతుందన్నారు. విగ్రహ ప్రాణప్రతిష్ట రోజున శ్రీరాముడికి పూజలు జరిపి అక్షింతలను చల్లుకోవాలన్నారు. కార్యక్రమంలో గురుగుహ, మోహన్‌రావు, కోటేశ్వరరావు, శ్యామసుందరరాజు, మల్లికార్జున, శైలజ తదితరులు పాల్గొన్నారు.

కోడిపందెం రాయుళ్ల అరెస్టు

నాయుడుపేట, జనవరి 16: నాయుడుపేట మండలం మేనకూరు సమీపంలోని మామిడికాలువ వద్ద కోడి పందేల స్థావరంపై ఎస్ఈబీ సీఐ ఆర్‌యుబీఎస్ ప్రసాద్ ఆధ్వర్యంలో మంగళవారం దాడులు నిర్వహించారు. కోడి పందేలు నిర్వహిస్తున్న వెంకటేశ్వర్లు, మునిరాజా, వీరాస్వామి, రమణయ్యను అరెస్టు చేశారు. వారి వద్దనుంచి రూ.5 వేల నగదు, 3 సెల్‌ఫోన్లు, మూడు పందెం కోళ్లు, రెండు కోడి కత్తులను స్వాధీనం చేసుకొన్నట్లు ఎస్ఈబీ సీఐ తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఈబీ సిబ్బంది సుకుమార్, వెంకటేశ్వర్లు, రమణయ్య, తిరుమలరావు పాల్గొన్నారు.

మద్యం బాటిళ్ల స్వాధీనం

సూళ్లూరుపేట, జనవరి 16: మున్సిపాలిటీ పరిధిలోని మన్నారుపోలూరు వద్ద 84 బాటిళ్ల మద్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకొన్నారు. ఆదివారం రాత్రి పోలీసులు మన్నారు పోలూరులో గస్తీలో ఉన్న సమయంలో సబ్‌స్టేషన్ సమీపంలో కొందరు వ్యక్తులు పోలీసులను చూసి పరారయ్యారు. పోలీసులు అక్కడికెళ్లి పరిశీలిచంగా గోనె సంచిలో ఉన్న 84 మద్యం బాటిళ్లు లభ్యమయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా శ్రీరామచంద్రుడి తెప్పోత్సవం





స్వామివారికి పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు - తెప్పోత్సవం

గూడూరు, జనవరి 16: స్థానిక కోనేటిమిట్టలోని కోదండరామాంజనేయస్వామి ఆలయ తెప్పకోనేరులో కనుమ పండుగ సందర్భంగా మంగళవారం శ్రీరామచంద్రుడికి వైభవంగా తెప్పోత్సవం నిర్వహించారు. కనుమూరు హరిచంద్రారెడ్డి చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు కనుమూరు హరిచంద్రారెడ్డి తన తండ్రి సత్యనారాయణరెడ్డి జ్ఞాపకార్థం రూ.70 లక్షలతో తెప్ప కోనేరును అభివృద్ధి పరిచారు. వేదపండితుల మంత్రోచ్చరణాల నడుమ స్వామివారికి సంప్రోక్షణం, పుణ్యహవాచన కార్యక్రమాలను నిర్వహించారు. శాంతి హోమాలు జరిపారు. అనంతరం విద్యుద్దీపాలతో అలంకరించిన హంసవాహనంపై స్వామివారిని ఉంచి వైభవంగా బాణసంచా పేలుళ్ల నడుమ తెప్పోత్సవాన్ని నిర్వహించారు. భక్తులు తెప్పోత్సవాన్ని తిలకించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంచిపెట్టారు. ఉభయదాతలుగా కనుమూరు హరిచంద్రారెడ్డి, కనుమూరు రవిచంద్రారెడ్డి వ్యవహరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్‌రావు, భక్తులు పాల్గొన్నారు.

కనుల పండువగా సిద్దేశ్వర, భూపతేశ్వరస్వామి ఉత్సవాలు



సిద్దేశ్వరస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

పెళ్లకూరు, జనవరి 16: మండలంలోని శిరసనంబేడు, రోసనూరు గ్రామాల్లో సంక్రాతి పర్వదినం సందర్భంగా మంగళవారం సిద్దేశ్వర, భూపతేశ్వరస్వామి ఉత్సవాలను కనుల పండువగా నిర్వహించారు. కార్తీక మాసంలో మహాశివుడికి పూజలు చేసినట్లే ధనుర్మాసంలో వైష్ణవ ఆలయాల్లో విశేష పూజలు నిర్వహిస్తారు. ఈ రెండు గ్రామాల్లో పూర్వీకుల నుంచి సంక్రాతి సందర్భంగా శివుడికి ప్రత్యేక పూజలు, ఉత్సవాలు చేయడం ఆనవాయితీగా వస్తోంది. సిద్దేశ్వర, భూపతేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేకంగా అలకరించి వైభవంగా కొండ చుట్టూ ఊరేగించారు. రాత్రి గ్రామంలో ఊరేగించారు. మేళతాళాలు, బాణసంచా పేలుళ్ల నడుమ వైభవంగా జరిగిన కొండచుట్టూ ఉత్సవాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కొండ కింద నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను కనువిందు చేశాయి. ఉమ్మడి నెల్లూరు జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు కందమూడి శివకుమార్, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వేలూరు మురళీకృష్ణారెడ్డి తదితరులు సిద్దేశ్వరస్వామిని దర్శించుకున్నారు.





ఏటి పండుగను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య - అంబరాన్నంటుతున్న గాలిపటాలు

ప్రారంభమైన ఏటి పండుగ

నాయుడుపేట టౌన్, జనవరి 16: నాయుడుపేట స్వర్ణముఖి నది పరివాహ ప్రాంతంలో ఏటి పండగను ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, మున్సిపల్ ఛైర్ పర్సన్ కటకం దీపిక మంగళవారం ప్రారంభించారు. సంక్రాంతి పండుగ పర్వదినాల్లో భాగమైన ఏటి పండుగ కనుమ రోజు ప్రారంభమై మూడు రోజుల పాటు వైభవంగా నిర్వహిస్తారు. తొలిరోజు బుల్లి తెర సినినటి ఐశ్వర్య, సినీ గాయకులచే గానలహరి జరిగింది.

వేడుకగా సంక్రాంతి సంబరాలు





వెంకటగిరి మండలం కందనాలపాడు గ్రామంలో ఉట్టి ఉత్సవం - సూళ్లూరుపేటలో క్రీడాకారులకు బహుమతులు అందజేస్తున్న వాణి

సూళ్లూరుపేట, జనవరి 16: మండల పరిధిలోని కోటపోలూరులో సోమవారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. మాజీ ఎంపీపీ ఇసనాక హర్షవర్ధన్ రెడ్డి సతీమణి వాణి చేతుల మీదుగా క్రీడలు, ముగ్గుల పోటీలను ప్రారంభించారు. గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఎంపీడీవో మురళీకృష్ణ, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చంద్రజిత్ యాదవ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

గూడూరు: మండలంలో సోమవారం సంక్రాంతి సంబరాలను జరుపుకున్నారు. పెద్దలకు కొత్తబట్టలు పెట్టి పూజలు నిర్వహించారు. బంధు మిత్రులతో కలిసి విందు భోజనాలు చేశారు. మంగళవారం కనుమ సందర్భంగా పశువులను అలంకరించి పూజలు నిర్వహించారు.

తడ: గ్రామాల్లో సంక్రాంతి సంబరాలు వేడుకగా జరిగాయి. సోమవారం ఆయా గ్రామాల్లో పొంగళ్లు పెట్టి పితృదేవతలకు పూజలు చేశారు. కారూరు గ్రామంలో ముగ్గుల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. బీవీపాలెం మాజీ సర్పంచు రత్నం పేదలకు నిత్యవరసర సరుకులు పంపిణీ చేశారు.

వెంకటగిరి: మండల పరిధిలోని పాపమాంబాపురం పంచాయతీ కందనాలపాడు గ్రామంలో మంగళవారం ప్రముఖ పారిశ్రామికవేత్త ఊటుకూరు దామోదర్‌రెడ్డి, లక్ష్మీలావణ్య దంపతుల ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. మహిళలకు, పురుషులకు, యువతకు ఆటలపోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

కోట: మండలంలోని గూడలి, తిన్నెలపూడి, విద్యానగర్, కోట, చిట్టేడు, కేసరం, మద్దాలి, కొత్తపట్నం తదితర గ్రామాల్లో మంగళవారం కనుమ పండుగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. తెల్లవారుజామున నుంచే రైతులు పశువుల కొట్టాలు దగ్గర పేడతో ముద్దలు చేసి దేవుళ్ల ప్రతిమలను సృష్టించారు. ఆవులు, గేదెలు, కోడె దూడలు, పందెపు గిత్తలకు రంగులు వేసి అందంగా అలంకరించారు. అనంతరం పచ్చా పొంగలి, పాల పొంగళ్లు, పొంగలే అంటూ నినాదాలు చేసి పశువులకు దిష్టి తీసి, పూజలు, పొంగళ్లు పెట్టారు.





సూళ్లూరుపేటలో సంతకాల సేకరణ పత్రాలను చూపుతున్న అంగన్వాడీలు - గూడూరులో గొబ్బిళ్లు ఆడుతూ నిరసన

పండుగ రోజుల్లో సమ్మె చేస్తున్నా పట్టించుకోరా?

సూళ్లూరుపేట, జనవరి 16: న్యాయమైన డిమాండ్ల సాధన కోసం అంగన్వాడీలు పండుగ రోజులను సైతం పక్కన పెట్టి సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడాన్ని సీఐటీయూ నాయకులు పద్మనాభయ్య తీవ్రంగా ఖండించారు. 36 రోజులుగా సమ్మె చేస్తున్నా చర్చల పేరుతో పిలిచి అవమానిస్తున్నారే తప్ప, ప్రభుత్వానికి డిమాండ్ల పరిష్కరించాలనే చిత్తశుద్ధి లేదన్నారు. మంగళవారం స్థానిక హోలిక్రాస్ కూడలి వద్ద శిబిరంలో అంగన్వాడీలు ఆందోళన చేశారు. గొబ్బెమ్మ పాటలు పాడుతూ నిరసన తెలిపారు. అంతకుముందు సూళ్లూరుపేట ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో సంతకాల సేకరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకురాలు హైమావతి, సీఐటీయూ నాయకులు లక్ష్మయ్య, రమణయ్య, అల్లెయ్య తదితరులు పాల్గొన్నారు.

గూడూరు: స్థానిక గ్రామసేవకుల భవనం వద్ద అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిరవధిక సమ్మె మంగళవారం కూడా రోజు కొనసాగింది. దీక్ష శిబిరం వద్ద అంగన్వాడీలు గొబ్బిళ్లు ఆడి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ ఇకనైనా రాష్ట్రప్రభుత్వం స్పందించి అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఇంద్రావతి, ప్రభావతి, శివకుమార్, బీవీ.రమణయ్య, సురేష్, ప్రసాద్, గోపినాథ్, చంద్రయ్య, పెంచలప్రసాద్, సుబ్బయ్య, రమణయ్య, పెంచలమ్మ, మునికుమారి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వెంకటగిరి: పట్టణంలోని బంగారుపేట వద్ద ఉన్న ఐసీడీఎస్ కార్యాలయం వద్ద సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో అంగన్వాడీలు చేస్తున్న రిలే దీక్ష మంగళవారం కొనసాగింది. ఈ సందర్భంగా అంగన్వాడీలు మాట్లాడుతూ తమ డిమాండ్లను పరిష్కరించే వరకు దీక్ష విరమించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు వడ్డిపల్లి చెంగయ్య, స్వరూపారాణి, సుభాషిణి, మంజుల, ఐఎఫ్‌టీయూ నేతలు మమ్ములాబేగం, లక్ష్మీప్రసన్న, అన్నపూర్ణ పాల్గొన్నారు.

కోట: పట్టణంలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట మంగళవారం కోట, వాకాడు, చిట్టమూరు మండలాల అంగన్వాడీ వర్కర్లు నిరసన తెలిపారు. మోకాళ్లపై నిలబడి దండాలు పెడుతూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

నాయుడుపేట టౌన్: అంగన్వాడీల సమ్మె 36వ రోజుకు చేరింది. మంగళవారం నాయుడుపేట ఐసీడీఎస్ కార్యాలయం వద్ద అంగన్వాడీలు చంటి బిడ్డలను చేతబట్టుకొని నిరసన తెలిపారు. సీఐటీయూ నాయకులు శివకవి ముకుందా, వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పండుగలు చేసుకోకుండా కుటుంబాలను సైతం వదిలి న్యాయపరమైన డిమాండ్ల కోసం అంగన్వాడీలు నిరసన తెలుపుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు.





కోటలోని మోకాళ్లపై నిలబడి దండాలు పెడుతూ, నాయుడుపేటలో చంటి బిడ్డలతో నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

గ్రామీణ క్రీడల విశిష్టతను తెలియజేసేందుకు పోటీలు



బొంగరాలు ఆడుతున్న స్థానికులు

గూడూరు, జనవరి 16: గ్రామీణ క్రీడల విశిష్టతను తెలియజేసేందుకు సంక్రాంతి సందర్భంగా ప్రగతిసేవాసంస్థ ఆధ్వర్యంలో గ్రామీణ క్రీడా పోటీలను నిర్వహించడం జరిగిందని సేవాసంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం స్థానిక ఏఏరెడ్డి ప్రభుత్వ స్టేడియంలో ప్రగతిసేవా సంస్థ ఆధ్వర్యంలో గ్రామీణ క్రీడా పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన సంప్రదాయ గ్రామీణ క్రీడలైన కోడింబిళ్ల, బొంగరాల ఆట, గోళీలాట తదితర క్రీడలను నిర్వహించామన్నారు. కార్యక్రమంలో పూర్ణచంద్రరావు, ధనుంజయరెడ్డి, రాజా, శ్రీనివాసులు, కరిముల్లా, పురందర్‌రాజు, రాము, వెంకటేశ్వర్లు, సతీష్, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న మున్సిపల్ కార్మికుల సమ్మె

వెంకటగిరి, జనవరి 16: మున్సిపల్ కార్యాలయం వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కార్మికులు చేస్తున్న సమ్మె మంగళవారం 14వ రోజు కొనసాగింది. ఈ సందర్భంగా ఏఐటీయూసీ నాయకులు మాట్లాడుతూ దీపావళి పండుగ నాటి నుంచి జీతాలు రాక ఇబ్బందులు పడుతున్నామని, సంక్రాంతికి తమ కుటుంబాలను పస్తులు పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. వేతనాలు చెల్లించే వరకు సమ్మె విరమించేది లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కల్లూరి జాన్, ఈశ్వరయ్య, రాజేష్, చక్రవర్తి, శ్రీనివాసులు, నాగార్జున, నాగేశ్వరావు, వెంకటేశ్వర్లు, చెంగల్‌రాయలు, సుబ్రహ్మణ్యం, చెంచురామయ్య, ప్రభాకర్, గంగయ్య, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

లోకేశ్‌ను కలిసిన తెలుగు యువత నేత



నాయుడుపేట/తడ, జనవరి 16: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌ను తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షుడు సుధీర్ కలిశారు. సంక్రాంతికి నారావారిపల్లికి విచ్చేసిన లోకేశ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పండుగ శుభాకంక్షలు తెలిపారు. అలాగే టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొమ్మన్ శ్రీధర్ కూడా చంద్రబాబు, లోకేశ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

యువతలో పోటీతత్వం పెరగాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్వీబీసీ ఛైర్మన్ సాయికృష్ణ యాచేంద్ర

వెంకటగిరి టౌన్, జనవరి 16: యువతలో పోటీ తత్వం పెరగాలని ఎస్వీబీసీ ఛైర్మన్ సాయికృష్ణ యాచేంద్ర అన్నారు. సంక్రాంతిని పురష్కరించుకుని మంగళవారం స్థానిక ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో కల్యాణ రామా కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్, ఏసీఏ ఉపాధ్యక్షుడు సర్వజ్ఞ కుమార యాచేంద్ర ఆధ్వర్యంలో యువతకు క్రీడా పోటీలు నిర్వహించారు. క్రీడాకారులకు టీషర్ట్స్ అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ నారాయణ, కమలాకర్ పాల్గొన్నారు.

స్కూల్ బ్యాగుల పంపిణీ

గూడూరు, జనవరి 16: స్థానిక కర్ణాలవీధి సమీపంలోని ముత్తూట్ మినీ ఫైనాన్స్ కార్యాలయంలో సంక్రాంతి సందర్భంగా నిర్వహించిన నృత్య పోటీల్లో ప్రతిభచాటిన విద్యార్థినులకు స్కూల్ బ్యాగులను అందజేశారు. సాయిసత్సంగ నిలయం వ్యవస్థాపకుడు కోట సునీల్‌కుమార్, గోపినాథ్, మల్లిక, శశిధర్, ప్రతాప్, అనూషా తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామ శోభాయాత్ర

నాయుడుపేట, జనవరి 16: పట్టణంలో మంగళవారం శ్రీరామ శోభాయాత్ర నిర్వహించారు. స్థానిక అగ్రహారపేటలోని ఆంజనేయస్వామి ఆలయం నుంచి శ్రీరాముని విశిష్టను వివరిస్తూ యాత్ర చేపట్టారు.

సాయినాధుడి తెప్పోత్సవం

వెంకటగిరి టౌన్, జనవరి 16: పట్టణంలోని కుమ్మరిగుంటలో సాయినాధుడికి మంగళవారం కనుమ పండుగ సందర్భంగా తెప్పోత్సవం నిర్వహించారు. సాయిబాబా ప్రత్యేక అలంకరణలో భక్తులు దర్శనమిచ్చారు.

కొత్తగుంటకు చేరిన అయోధ్య అంక్షితలు

చిట్టమూరు, జనవరి 16: అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలను కొత్తగుంటలోని ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయానికి మంగళవారం చేరుకున్నాయి. చిట్టమూరు గ్రామానికి చెందిన రామ భక్తురాలు బుజ్జమ్మ ఆలయ నిర్వాహకులకు అందజేశారు. గ్రామంలో ఉన్న ప్రతి ఇంటికీ శ్రీరాముని అక్షింతలు, కరపత్రాలను అందించాలని కోరారు.

ఆర్థిక సాయం

చిల్లకూరు, జనవరి 16: మండలంలోని కోట క్రాస్‌రోడ్డు సమీపంలో ఉన్న నక్కలవారికండ్రిగ కాలనీకి చెందిన జయమ్మ కిడ్నీ వ్యాధితో బాధపడుతుండడంతో వైద్యఖర్చుల నిమిత్తం రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఫౌండర్ రాజనేని శ్రీనివాసులునాయుడు, శిరీష, రామయ్యనాయుడు చేతుల మీదుగా రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు.

శ్రీవారి ఆలయంలో తిరిగి మొదలైన సుప్రభాతం

తిరుమల, జనవరి16(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి ఆలయంలో సుప్రభాత సేవ తిరిగి మొదలైంది. పవిత్రమైన ధనుర్మాసం ఆదివారంతో ముగియడంతో సోమవారం వేకువజాము నుంచి శ్రీవారి ఆలయంలో సుప్రభాతసేవ పునఃప్రారంభమయ్యింది. గతేడాది డిసెంబరు 17వ తేదీ తెల్లవారుజాము నుంచి ధనుర్మాస ఘడియలు ప్రారంభమైన నేపథ్యంలో శ్రీవారి ఆలయంలో సుప్రభాతసేవ స్థానంలో గోదా తిరుప్పావై పారాయణం కొనసాగింది. అయితే జనవరి 14వ తేదీతో ధనుర్మాస ఘడియలు పూర్తికావడంతో 15వ తేదీ నుంచి యథాప్రకారం ఆలయంలో సుప్రభాత సేవ నిర్వహించారు.